ఆదివారం
16-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 146
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

# ఇండియా ఐక్యసంఘటన అవశ్యం

**రాహుల్ గాంధీ నేతృత్వం వహించాలి**

**ఇండియా టుడే- సీ ఓటర్ సర్వే వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలో బీజేపీని ఎదుర్కోవడానికి ఇండియా ఐక్య సంఘటన అవసరమని దేశంలోని అత్యధికమంది ప్రజలు కోరుకుంటు న్నారు. విపక్ష జాతీయ, ప్రాంతీయ పార్టీలు విడివిడిగా పోటీ చేయడం కన్నా ఉమ్మడిగా పోటీ చేయడం ద్వారానే బీజేపీని ధీటుగా ఎదుర్కొం టాయని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఇండియా ఐక్య సంఘటనకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ నేతృత్వం వహించాలని ఎక్కువమంది ఆకాంక్షించారు. ఈ మేరకు ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే వెల్లడించింది. దాదాపు 11 ఏళ్లుగా దేశాన్ని అప్రతిహతంగా పరిపాలి స్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి తమిళనాడు నుంచి దిల్లీ వరకు వివిధ రాజకీయ పార్టీలు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్(ఇండియా) పేరుతో జట్టు కట్టాయి. ఈ పార్టీ లన్నీ కలిసి 2024లో ఎన్డీయేకు వ్యతిరేకంగా బరిలోకి దిగినా విజయం సాధ్యం కాలేదు. అయితే చెప్పుకోదగిన స్థాయిలో సీట్లు సాధించగలిగాయి. ఇండియా ఐక్యసంఘటనలోని వివిధ పార్టీల మధ్య వైరుధ్యాలు నెలకొన్నా... ఎన్డీయేను నిలువరించడానికి కలిసి కట్టుగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇండియా ఐక్యసంఘటనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఇండియా టుడే-సీ ఓటర్ సంయుక్తంగా మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే నిర్వహించాయి. ఈ ఏడాది జనవరి 2 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు 1,25,123 మంది ఓటర్లను ఈ సర్వేలో భాగంగా ప్రశ్నించారు. సర్వేలో పాల్గొన్న వారిలో 65 శాతం మంది పార్టీలన్నీ కలిసి ఇండియా ఐక్యసంఘటనలోనే కొనసాగాలని సూచించారు. 26 శాతం మంది ఐక్యసంఘటన అనవసరమని భావించారు. ఇండియా ఐక్యసంఘ టనకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వం వహించాలని అత్యధికంగా 24 శాతం మంది

- మిగతా 2 లో

## మహాత్ముడికి అవమానం

న్యూఢిల్లీ: రష్యాకు చెందిన ఓ బ్రూవరీ సంస్థ బీరు క్యాన్లపై మహాత్మా గాంధీ చిత్రాన్ని ముద్రించడం వివాదాస్పదంగా మారింది. ఈ చిత్రాలు నెట్టింట వైరల్‌గా మారడంతో నెటిజన్లు భగ్గుమం టున్నారు. రష్యాకు చెందిన రివోర్ట్ సంస్థ మహాత్ముడి చిత్రంతో పాటు, 'మహాత్మ జి' అనే పేరు కూడా ముద్రించి బీర్ క్యాన్లను విక్రయిస్తోంది. తాజాగా ఈ వ్యవహారం ఒడిశా మాజీ సీఎం నందిని సత్పతి మనవడు సుపర్ణో సత్పతి దృష్టికి రావడంతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్

- మిగతా 2 లో

## ఏడీఈ అక్రమాస్తులు రూ.100 కోట్ల పైనే

విశాలాంధ్ర–హైదరాబాద్: గచ్చిబౌలిలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్‌రెడ్డి రూ.50 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. దీంతో నిన్నటి నుంచి ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాం తాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో 22 ఎకరాల వ్యవసాయ భూమి, ఓపెన్ ప్లాట్లు, విల్లా, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా

- మిగతా 2 లో

## బెంగాలీ గాయకుడు ప్రతుల్ కన్నుమూత

కోల్‌కతా: ప్రముఖ బెంగాలీ గాయకుడు, స్వరకర్త, గీత రచయిత ప్రతుల్ ముఖోపాధ్యాయ (83) శనివారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా వయో సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఫిబ్రవరి 4వ తేదీన చికిత్స కోసం సేఠ్ సుఖ్‌లాల్ కర్నానీ మెమోరియల్ (ఎస్ఎస్‌కేఎం) ఆసుపత్రిలో చేరారు. ఆ తర్వాత ఆయనకు కత్తిగాయ మైంది. దీంతో వైద్యులు వెంటనే ఆయనను ఐసీయూకు తరలించి చికిత్సనందించారు. శుక్రవారం చేసిన దయాలసిస్‌కు ఆయన స్పందించలేదు. గుండెపోటుకు

- మిగతా 2 లో

## ప్రపంచానికే ఆదర్శం

# ఫ్యూచర్ సిటీ

- బిల్డర్లకు సంపూర్ణ సహకారం
- రాష్ట్రాభివృద్ధికి విధానపర నిర్ణయాలు
- ఆశించిన స్థాయిలో స్థిరాస్తి రంగం: భట్టి

విశాలాంధ్ర- తెలంగాణ: ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ అధ్వర్యంలో నోవాటెల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ...ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ అంకితభావం చాటిచెప్పడానికే ఐజీబీసీతో ఫ్యూచర్ సిటీపై ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా మినహాయింపునిచ్చామన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని తెలిసినా... ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలను మరింత పెంచేలా రూ.10 వేల కోట్లు కేటాయించినట్టు వివరించారు. మూసీ సుందరీకరణ చేపట్టినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్తి రంగం ఆశించిన స్థాయిలో ఉందన్నారు. స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అని భట్టి అన్నారు. బిల్డర్లు, డెవలపర్లను ప్రభుత్వం గౌరవప్రదమైన పౌరులుగా చూస్తుందన్నారు. వారు సంపద సృష్టికర్తలు, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములన్నారు. వారికి సంపూర్ణ సహకారం అందనిస్తామన్నారు. బిల్డర్లకు హైదరాబాద్ స్వర్గధామం అన్నారు.

గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాదును తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం అన్నారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్‌లో పర్యటించి 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలిగారని వివరించారు. 2029-30 కి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా కొత్త విద్యుత్ పాలసీలో స్పష్టం చేశామన్నారు. 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

## ట్రంప్ సర్కార్ కాఠిన్యం

**10 వేల మంది కార్మికుల తొలగింపు** 2లో

# కులగణన దేశానికే రోడ్ మ్యాప్

- మోదీని వ్యక్తిగతంగా అనలేదు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు చెప్పినట్టు నడుస్తా
- అర్హులకు సంక్షేమ ఫలాల చేరువే లక్ష్యం: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర- తెలంగాణ: తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా శనివారం సుమారు గంట సేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన ఆయన... తాజా రాజ కీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నామన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్ అన్నారు. రాహుల్ గాంధీ చెప్పింది కచ్చితంగా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో

- మిగతా 2 లో

## కేజ్రీవాల్‌కు బిగుస్తున్న ఉచ్చు

**'శీష్ మహల్'పై విచారణకు కేంద్రం ఆదేశం**

న్యూఢిల్లీ: దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఉచ్చు బిగుస్తోంది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తర్వాత మోదీ సర్కారు కక్ష కేజ్రీవాల్‌పై సాధింపులకు పాల్పడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అందులో భాగంగా అధికారంలో ఉండగా కేజ్రీవాల్ చేపట్టిన శీష్ మహల్ (సీఎం అధికారిక నివాసం) పునరుద్ధరణలో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు మోదీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ)ని బీజేపీ ఉపయోగించుకుంది. దీనిపై కేంద్ర ప్రజాపనుల విభాగం నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఫిబ్రవరి 13న ఈ ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో 6 ఫ్లాగ్‌స్టాఫ్ బంగ్లా పునరుద్ధరణకు ఆప్ ప్రభుత్వం భవన నిబంధనలు ఉల్లంఘించిందనే

- మిగతా 2 లో

# సంక్షేమ పథకాలు ఉచితాలెలా అవుతాయి

**దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలి: కూనంనేని**

విశాలాంధ్ర–హైదరాబాద్: పేదలు తమ చెమట ధారపోసి సంపదను సృష్టిస్తూ జీఎస్‌టీ రూపంలో చెల్లిస్తున్న డబ్బులనే ప్రభుత్వాలు తిరిగి ప్రజలకు సంక్షేమం కోసం వినియోగిస్తున్నా యని, అలాంటి సంక్షేమ పథకాలు ఎలా ఉచితాలు అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. అసలు ఈ దేశంలో ఎవరి సొమ్ము ఎవరూ తింటు న్నారో తేల్చాల్సిన సమయం ఆసన్నమైం దన్నారు. ఈ అంశంపై సీపీఐ అధ్వర్యంలో అన్ని వర్గాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని మాట్లాడుతూ ఉచితాలు తప్పంటూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, జయప్రకాశ్ నారాయణ లాంటి కొందరూ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడుతుంటారని, కానీ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని, ఇతర పనులకు కూడా ఎవరూ రావడం లేదని మేధావులు, న్యాయమూర్తులు వ్యాఖ్యానిం చడం శోచనీయమన్నారు. వారు దేశ ఆర్థిక పరిస్థితులు, సామాజిక స్థితిగతులను అర్థం చేసుకుని మాట్లాడినట్లుగా లేదని ఆయన అన్నారు. వ్యవసాయ కూలీలు, కూలీలుగానే ఉండి పోవాలా?, వారు బిడ్డలు చదువుకుని ఇతర ఉద్యోగాలు చేయవద్దనేది వారి ఉద్దేశమా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ లాంటి వారందరూ ఫ్యూడల్ వ్యవస్థ నుంచి బయటకు రావాలని హితవు పలికారు. పేదలు బాగా చదువుకుని... ఆర్థిక పరిస్థితి మెరుగుపడి వారి కొనుగోలు శక్తి పెరిగినప్పుడే ఈ దేశం ఆర్థికంగా పురోగాభివృద్ధి చెందుతుందనే విషయాన్ని దేశ పాలకులు, మేధావివర్గం గుర్తించకపోవడం అత్యంత దారుణమని అన్నారు. దేశంలో జీఎస్‌టీ రూపంలో సుమారు రూ.23 లక్షల కోట్లు సమకూరుతుండగా, ఇందులో 10 శాతం మాత్రమే సంపన్నులదని, మిగిలిన 90 శాతం నిరుపేదలు, పేదలు, మధ్యతరగతి వారు చెల్లిస్తున్నదేనని కూనంనేని వివరించారు. ఈ 90 శాతం సొమ్మునే కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి అప్పనంగా రుణాలు తీసుకుని ఎగ్గడితే... మోదీ ప్రభుత్వం రూ.15 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టిన వెంటనే 30 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నులను 28 శాతానికి తగ్గించి, వారికి ప్రతి ఏటా సుమారు రూ.5 లక్షల కోట్ల లాభం చేకూర్చారని, ఇలాంటి వాటిని ఏమంటారని ఆయన నిలదీశారు. దీనిపై చర్చ నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణనను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి పార్లమెంటులో తక్షణమే చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్లను పెంచి చేతులు దులుపుకోకుండా, సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్ నిరసిస్తూ ఈ నెల 18,19 తేదీల్లో వామపక్ష పార్టీలు దేశ వ్యాప్త నిరసనలు చేపట్టనున్నాయని, ఇందులో భాగంగా రాష్ట్రంలో ఈనెల 18 లేదా 19వ తేదీన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని సాంబశివరావు వెల్లడించారు.

**స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తశుద్ధి చాటుకోవాలి**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పరస్పర అవగాహన విషయంలో కాంగ్రెస్

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

సారు..నన్ను 'కామన్ మేన్' అంటారు. ఆంధ్రాలో వుంటాను ఒక్కసారి నన్ను కూడా దర్శించుకోండి!

# పారదర్శకంగా నీటిపారుదల రంగం

- ప్రాజెక్ట్‌ల పురోగతిపై పర్యవేక్షణ పెంచాలి
- రాజస్తాన్ సదస్సుకు సమగ్ర నివేదిక రూపొందించాలి
- నీటి నిల్వల పెంపుపై ప్రత్యేక దృష్టి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: టిపారుదలశాఖ పారదర్శకంగా పనిచేయాలని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ల పురోగతి పై పర్యవేక్షణ పెంపొందిం చేలా చర్యలు తీసుకోవాలని అధికా రులకు సూచించారు. నిర్దేశించిన పనులలో ఆలసత్వం చూపిస్తే సహించేది లేదని మందలించారు. ఈ నెల 18,19 తేదీలలో రాజ స్థాన్‌లో జరగనున్న అఖిల భారత నీటిపారుదల మంత్రుల సదస్సుతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎస్.ఎల్.బి.సి, డిండి లతో పాటు వివిధ ఎత్తిపోతల పథకాల పురోగతితో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై శనివారం జలసౌధ లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్తమ్ మాట్లాడుతూ నీటిపారుదల రంగంలో తీసుకొచ్చిన

- మిగతా 2 లో

# వంశీకి కష్టాలు

- సెల్ ఫోన్ కోసం నివాసంలో విస్తృత తనిఖీలు
- మరిన్ని ఆధారాల కోసం పోలీసుల వేట
- మట్టి తవ్వకాలు, ఫోర్జరీ కేసుపైనా దృష్టి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. వంశీ అరెస్టు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం అయింది. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఉందన్న ధీమాతో ఉన్న వంశీ అనూహ్యంగా కిడ్నాప్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బుక్ అయ్యారు. గురువారం

- మిగతా 2 లో

**శతవసంతాల అరుణపథం**

## రైతు ఉద్యమ మార్గదర్శి

రైతు ఉద్యమానికి శ్రీకారం చుట్టినవారిలో మొట్ట మొదట చెప్పుకోవలసింది స్వామీ సహజానంద సరస్వతి గురించే. అంత మాత్రం చేత మన దేశంలో అంతకు ముందు రైతు ఉద్యమాల ఆనవాళ్లు లేవని కాదు. ఆయనంత దీక్షగా రైతుల గురించి ఆలోచించినవారు మాత్రం తక్కువే.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

# ట్రంప్ సర్కార్ కాఠిన్యం

## 10 వేల మంది కార్మికుల తొలగింపు

**వాషింగ్టన్:** అమెరికాలో ఉద్యోగాల కోత మొదలైంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సలహాదారుడు ఎలాన్ మస్క్ నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే 75 వేల మందికి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని ఆదేశాలు జారీచేసిన ట్రంప్ సర్కార్... తాజాగా వివిధ ఏజెన్సీలలో పనిచేస్తున్న 9500 మందికిపైగా కార్మికులపై వేటు వేసింది. తొలగింపునకు గురైనవారిలో ఫెడరల్ భూముల వ్యవహారాలు చూసే కార్మికులు, మిలిటరీ ప్రముఖుల కేర్‌లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. అదేవిధంగా హోంశాఖ, ఇంధనం, వెటరన్స్ అఫైర్స్, వ్యవసాయం, ఆరోగ్య సేవల ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. ఫెడరల్ ఏజెన్సీలన్నింటినీ అమెరికా వదిలించుకోవాల్సి సమయం వచ్చేసిందనిఎలాన్ మస్క్ ఇప్పటికే ప్రకటించారు. ప్రభుత్వ పనితీరును సమూలంగా పునర్‌వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ చర్య తప్పదని స్పష్టం చేశారు. వృథా ఖర్చుల తగ్గింపు, సామర్థ్య పెంపు కోసం ఏజెన్సీల సామూహిక మూసివేతలు తప్పవన్నారు. ఇందులో భాగంగా ఫెడరల్ వర్క్ ఫోర్స్‌లో పరిమాణాన్ని తగ్గించేందుకు, ప్రొబేషనరీ (ఏడాది కంటే తక్కువ అనుభవం ఉన్న) ఉద్యోగులను తొలగించాలని మస్క్ ఆదేశాలు జారీచేశారు. అన్ని విభాగాల్లో ప్రొబేషనరీ ఉద్యోగులను తొలగించాలని ఏజెన్సీలకు స్పష్టం చేశారు. ఉద్యోగాల కోతలు విధించే వాటిలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్, నేషనల్ సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్ విభాగాలకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో మినహాయింపు ఇచ్చారు. పోస్టల్ సేవలు మినహాయించి అమెరికాలో దాదాపు 23 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. వీరంతా వివిధ ఏజెన్సీలలో పనిచేస్తున్నారు. ఫెడరల్ శ్రామిక శక్తిలో భద్రతా సంబంధిత ఏజెన్సీలు ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నాయి. కానీ అమెరికా వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణను, వ్యవసాయాన్ని పర్యవేక్షించడం, ప్రభుత్వ బిల్లులు చెల్లించడం వంటి ఇతర ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు ఇప్పటికే ట్రంప్ బైఅవుట్ ప్యాకేజీ ప్రకటించారు. దీని కింద ఫిబ్రవరి 6లోగా ఉద్యోగాలు స్వచ్ఛందంగా వదులుకున్న వారికి 8 నెలల జీతం ఇస్తానని చెప్పారు. అయితే ఈ విషయంలో ఫెడరల్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. బైఅవుట్ ఆఫర్‌ను ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి నిలిపివేశారు.

## సైన్యంలో ట్రాన్స్‌జెండర్లకు స్వస్తి

పరిపాలనకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్‌లు పాల్గొనడాన్ని నిషేధించిన ట్రంప్... తాజాగా ఆ దేశ మిలిటరీ విభాగంలో ట్రాన్స్‌జెండర్‌ల నియామకాన్ని నిలిపివేశారు. ఈ మేరకు అమెరికా సైన్యం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ట్రాన్స్‌జెండర్‌లు సైన్యంలో చేరడాన్ని అమెరికా మిలిటరీ విభాగం నిషేధిస్తుంది. సర్వీసులో ఉండగా లింగమార్పిడి విధానాలకు అనుమతించబోం. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. అమెరికాకు సేవ చేయాలనుకునే జెండర్ డిస్ఫోరియా వ్యక్తులను మేం గౌరవిస్తాం. తమను తాము ట్రాన్స్‌జెండర్‌గా భావించే వారి నియామకాలను ఆపేస్తున్నాం' అని రాసుకొచ్చారు. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన సమయంలోనూ ట్రాన్స్‌జెండర్లు సాయుధ దళాల్లో చేరకుండా ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే మిలిటరీలో పనిచేస్తున్న వారిని మాత్రం కొనసాగించారు. ప్రమాణస్వీకారానికి ముందు నిర్వహించిన ర్యాలీలో మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తానని ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. ఆ దిశగా ఇటీవల కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. తాజాగా ఆర్మీలో ట్రాన్స్‌జెండర్‌ల నియామకాన్ని తొలగించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులపై రిపబ్లికన్ పార్టీ నేతలు తీవ్రమైన అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఒలింపిక్స్ వేదికగా అల్జీరియాకు చెందిన ఇమానె ఖెలిఫ్‌కు సంబంధించిన విషయంలో లింగ వివాదం నడిచిన సంగతి తెలిసిందే. అప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా మహిళల ఆటలో పురుషులు లేకుండా చేస్తానని వ్యాఖ్యానించారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచిన డెమోక్రటిక్ సభ్యురాలు, ట్రాన్స్‌జెండర్ సారా మెక్‌బ్రైడ్‌ను మహిళల బాత్‌రూమ్‌లోకి అనుమతించబోమని రిపబ్లికన్లు ప్రత్యేక తీర్మానం తీసుకువచ్చారు.

## మరో ముగ్గురు బందీలకు విముక్తి

**టెల్‌అవీవ్:** గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా మరో ముగ్గురు బందీలను హమాస్ విడుదల చేసింది. ఆ బందీలను శనివారం రెడ్‌క్రాస్‌కు అప్పగించింది సాగుయ్ డెకెల్ చెన్ (36), అలెగ్జాండర్ ట్రుఫనోవ్ (29), యైర్ హార్న్(46)లను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాల్పుల విరమణను ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తూ, బందీల విడుదలను ఆలస్యం చేస్తున్నట్లు ఇటీవల హమాస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా ఇజ్రాయిల్ తీవ్రంగా పరిగణించింది. ఈ వారాంతంలో తమ బందీలను విడుదల చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ బెదిరింపులకు తలొగ్గిన హమాస్ బందీల విడుదలకు అంగీకరించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయిల్ 369 మంది పలస్తీనియన్లను విడుదల చేసింది. ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వంతో గత నెల ఇజ్రాయిల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఇందులో భాగంగా హమాస్ తమ చెరలోని 94 మంది బందీల్లో 33 మందిని విడుదల చేయనుంది. ప్రతిగా 1700 మందికి పైగా పలస్తీనీయులకు తమ జైళ్ల నుంచి ఇజ్రాయిల్ విముక్తి కల్పించనుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటివరకు దఫదఫాలుగా 21 మంది బందీలను మిలిటెంట్ సంస్థ విడుదల చేయగా... 730 మంది పలస్తీనా ఖైదీలకు టెల్‌అవీవ్ విముక్తి కల్పించింది.

## కేజ్రీవాల్‌కు బిగుస్తున్న ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలపై విచారించి సమగ్ర నివేదిక తయారుచేయాలని కేంద్రం సీపీడబ్ల్యూడీని ఆదేశించింది. అధికారిక నివాసానికి పొరుగునున్న నాలుగు ప్రభుత్వ ఆస్తులను చట్ట విరుద్ధంగా విలీనం చేసి... విలాసవంతమైన శీష్‌మహల్‌ను విస్తరించారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు. ఆ ఆస్తుల విలీనాన్ని రద్దు చేయాలని కోరుతూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాశారు. దేశ రాజధానిలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక నూతన ముఖ్యమంత్రి శీష్‌మహల్‌లో ఉండబోరని పేర్కొన్నారు. ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా బీజేపీ విమర్శిస్తూ వచ్చింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి కేజ్రీవాల్ 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ బీజేపీ ప్రచారం చేసింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ... తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ దుయ్యబట్టిన సంగతి తెలిసిందే. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని దెబ్బతీశాయి. బీజేపీకి విజయాన్ని కట్టబెట్టాయి.

## మహాత్ముడికి అవమానం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ వెంటనే జోక్యం చేసుకోవాలని, రష్యా అధ్యక్షుడితో మాట్లాడాలని కోరారు. ఎక్స్‌లో ఆయన పోస్ట్ వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆ కంపెనీపై మండిపడుతున్నారు. మహాత్ముడికి ఆల్కహాల్‌తో సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఆ చిత్రాలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. కోట్లాది మంది భారతీయుల మనోభావాలు దెబ్బతీయడం ఏమాత్రం తగదని ఓ యూజర్ రాసుకొచ్చారు. 2019లోనూ ఇజ్రాయిల్‌కు చెందిన ఓ లిక్కర్ కంపెనీ ఇలాగే చేసింది. చీవాట్లు తిన్నాక క్షమాపణలు చెప్పింది.

## బెంగాలీ గాయకుడు ప్రతుల్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గురై శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కొన్నిరోజుల క్రితమే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆసుపత్రికి వెళ్లి... ముఖోపాధ్యాయను పరామర్శించారు. ఆయన మరణవార్త తెలిగానే రాష్ట్ర మంత్రి అరూప్ బిశ్వాస్, ఇంద్రనీల్ సేన్, ఎంపీ డోలా సేన్ ఆసుపత్రికి చేరుకుని... ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కోల్‌కతాలోని రవీంద్ర సదన్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచి... అనంతరం నేత్రదానం కోసం ఎస్‌ఎస్‌కేఎం ఆసుపత్రికి అప్పగించారు. కాగా, 'అమీ బంగ్లార్ గాన్ గౌ', 'డింగా భాసావో రే' వంటి గుర్తుండిపోయే పాటలను ఆయన పాడారు.

# అవిశ్రాంత పోరాట యోధుడు ధర్మభిక్షం

### సీపీఐ నేతల ఘన నివాళి

**విశాలాంధ్ర-హైదరాబాద్:** సమసమాజమే లక్ష్యంగా, అణగారిన వర్గాల్లో చైతన్యం రగిలించిన అవిశ్రాంత పోరాట యోధుడు సీపీఐ అగ్రనాయకులు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం అని నాయకులు కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, ఇప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్, రాష్ట్ర సమన్వయ అధ్యక్షుడు నాగ భూషణం, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, సదానంద్ హాజరయ్యారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ధర్మభిక్షం అంటేనే క్రియాశీల ఉద్యమాలకు పెట్టింది పేరని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించిన ధీర కమ్యూనిస్టు అని కొనియాడారు. కులాల పేరుతో కాకుండా చేతి వృత్తిదారులైన బీసీ, ఎస్సీ, అణగారిన వర్గాలలో చైతన్యం రగిలించి... వారి అభ్యున్నతికి బాసటగా నిలిచారని గుర్తుచేశారు. సూర్యాపేట కేంద్రంగా నాడు హాస్టళ్లు తెరిచి అనేకమందికి చదువుకునే అవకాశం కల్పించారని, ఆయన శిష్యులు అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పుడు కీలక నేతలుగా ఉన్నారని తెలిపారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ధర్మభిక్షం వ్యక్తి కాదని, ఒక సంస్థ అని అన్నారు. ధర్మభిక్షం ఎంపీగా, ఎంఎల్‌ఏగా, ప్రజానేతగా ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగే ఉన్నారని, ఆయన తాడిత, పీడిత ప్రజల కోసం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పశ్యపద్మ మాట్లాడుతూ ధర్మభిక్షం తన జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప నాయకుడని నివాళి అర్పించారు. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ధర్మభిక్షం ఆశయాలు కొనసాగించడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతామన్నారు. మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ రాజకీయ నాయకుడు అంటే ఎలా ఉండాలో, విలువలు నేర్పిన నాయకుడు ధర్మభిక్షం అని అన్నారు. సాయిల్‌గౌడ్ మాట్లాడుతూ గీత పనివారల కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి... వారికి అనేక హక్కులు సమకూర్చిపెట్టిన గొప్ప నాయకులు ధర్మభిక్షం అని కొనియాడారు. సృజన మాట్లాడుతూ ఉద్యమాలకు నిలువుటద్దం ధర్మభిక్షం అని, ఆయన చూపిన పోరాట మార్గంలో ప్రయాణించడమే కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా తమ కర్తవ్యమని అన్నారు. సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి మారుపాక అనిల్, నాయకులు బి.వేణు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల జోలికి వస్తే వదిలిపెట్టేది లేదు

### గంజాయిపై ఉక్కుపాదం
### ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరిక
### స్వచ్ఛాంధ్రకు సహకరించాలని విజ్ఞప్తి

**విశాలాంధ్ర-నెల్లూరు:** రాష్ట్రంలో తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. గంజాయి సహా మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా సహా ఇతర నేరాలకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం దూబగుంటలో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. స్థానికులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభించి... ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛాంధ్రలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అందరూ శ్రమించాలి. ఏపీని స్వచ్ఛాంధ్ర చేయాలని సంకల్పించాం. పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు నెలలో ఒకరోజు కేటాయించాలి. స్వచ్ఛమైన ఆలోచనలు చేస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుంది. నేరస్థుల పట్ల కఠినంగా ఉంటాం. ఆడబిడ్డల జోలికి వచ్చిన వారిని వదిలేది లేదు. గంజాయి ఉత్పత్తి చేస్తే ఉపేక్షించం. గత ప్రభుత్వంలో చెత్తపైనా పన్ను వేసి ప్రజలను వేధించారు. ప్రస్తుతం చెత్తను పునర్వినియోగం చేసేందుకు యోచిస్తున్నాం. చెత్త నుంచి సంపద సృష్టికి ప్రయత్నిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చింది. సంపద సృష్టిస్తేనే అభివృద్ధి జరుగుతుంది. ఏపీలో 50 శాతం పచ్చదనం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రతినెలా పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. ఐదేళ్లుగా రోడ్లపై తట్టెడు మట్టి కూడా వైసీపీ సర్కార్ వేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలన్నీ పూడ్చి వేశాం. కేవలం 8 నెలల్లోనే ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. దీపం పథకం కింద మహిళలకు ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం. ప్రజల కోసం ఇంకా ఎంతో చేయాలని ఉంది. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదనే... వాట్సాప్ పాలన తీసుకొచ్చాం. సెల్‌ఫోన్ ద్వారానే సేవలు పొందేలా ఏర్పాట్లు చేశాం. ఒక్క మెసేజ్ పెడితే సర్టిఫికెట్ వచ్చేస్తుంది. యువత ఉద్యోగం చేయడం కాదు... ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. ఎన్టీఆర్ హయాంలో మండల వ్యవస్థలు తీసుకువస్తే... ప్రస్తుతం ప్రజల వద్దకే పాలనను మేము తీసుకొచ్చాం' అని చంద్రబాబు చెప్పారు.

# 'ఉపకారం'లో వివక్ష!

- ఆందోళనలో పశువైద్య విద్యార్థులు
- 13 ఏళ్లుగా పెంచని ప్రభుత్వాలు
- చొరవ చూపాలని కూటమి నేతలకు వినతి



**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** సమాజంలో పశు వైద్యుల పాత్ర అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. జంతువుల ఆరోగ్య సంరక్షణకే పరిమితం కాకుండా మానవ ఆరోగ్యానికి సంబంధించిన పాత్ర (జంతువుల నుంచి మానవులకు వ్యాపించే రోగాలను నియంత్రించడం), జంతు సంక్షేమం, వన్యప్రాణుల సంరక్షణ, వ్యాధుల నివారణకు శాస్త్రీయ పరిశోధనలు, ఔషధాలు, చికిత్సా పద్ధతులలో కీలక పాత్ర పోషిస్తారు. అటువంటి వైద్య వృత్తిని ఎంచుకుని సమాజంలో తమ వంతు సేవలు అందించాలని ముందుకు వచ్చి వెటర్నరీ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఉపకార వేతనాల విషయంలో రాష్ట్రంలో తీవ్ర వివక్షతకు గురవుతున్నారు. ఫీజులు భారీగా పెంచుతున్నారు కానీ ఉపకార వేతనాలను పెంచడం లేదు. 13 సంవత్సరాలుగా బీవీఎస్‌సీ (యూజీ) కోర్సుకు రూ.ఏడువేలు, పీజీ కోర్సుకు రూ.తొమ్మిదివేలు, పీహెచ్‌డీ కోర్సుకు రూ.10వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా గరివీడు, తిరుపతి, గన్నవరం, పొద్దుటూరులో పశు వైద్య కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలను పెంచి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో 2022, మార్చి లో ఉపకార వేతనాలు పెంచాలంటూ సమ్మె చేశారు. నాటి మంత్రి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఉపకార వేతనాల పెంపునకు చర్యలు చేపట్టలేదు. 2013లో బీవీఎస్‌సీ కోర్సు ఫీజు 10,900 ఉండగా నాడు ఉపకార వేతనంగా రూ.ఏడువేలు ఇచ్చారు. 2020లో ఫీజు రూ.20,600. 2025లో రూ.47,900లకు ఫీజు పెంచారు. కానీ ఉపకార వేతనం 2013 నుంచి అదే ఏడు వేల రూపాయలు కొనసాగుతోంది. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ కోర్సుల మాదిరిగానే బీవీఎస్‌సీ యూజీ కోర్సు వ్యవధి ఐదున్నర సంవత్సరాలు, ఇంటర్న్‌షిప్ ఒక ఏడాది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్ వైద్య విద్యార్థులకు మాత్రం ఉపకార వేతనం రూ.22 వేల నుంచి 25వేలకు పైగానే అందిస్తున్నారు. పీజీ విద్యార్థులకైతే రూ.50 నుంచి రూ.60వేలకుపైగా ఉపకార వేతనాలను అందిస్తుండగా, పశువైద్య పీజీ విద్యార్థులకు మాత్రం రూ. తొమ్మిది వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ స్కాలర్స్ విషయానికి వస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. వారికి రూ.80 వేలకు పైగా ఉపకార వేతనాలు ఇస్తుండగా, వీరికి మాత్రం రూ.పది వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే చాలా తక్కువ. రాజస్థాన్‌లో రూ. 24వేలు ఇస్తుండగా, ఉత్తరప్రదేశ్ లో రూ.23,500, పశ్చిమ బెంగాల్, కేరళలో రూ.20వేలు, హర్యానాలో 15 వేలు, కర్నాటక, తమిళనాడులో రూ.14వేలు ఉపకార వేతనాలుగా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పశువైద్య విద్యార్థులు తమకు ఉపకార వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పారదర్శకంగా నీటిపారుదల రంగం

(మొదటిపేజీ తరువాయి)

సంస్కరణలు,డిజిటల్ మానిటరింగ్‌తో పాటు ఆధునిక నీటి నిర్వహణపై అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ అమలు తీరుపై జాతీయ స్థాయిలో గణాంకాలతో ప్రదర్శించేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రాజెక్ట్ లలో పూడిక తీత ఇతర రాష్ట్రాలకు మార్గదర్శనం అయ్యేలా దిశానిర్దేశం చేయనున్నట్టు వెల్లడించారు. తక్కువ వ్యయంతో అధిక ఆయకట్టు విస్తరణ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడం వంటి అంశాలపై ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం ద్వారా అదనంగా 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వివరించారు. ఎస్సెల్బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాల్వ), దిండి, పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల, వివిధ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు సమగ్ర నివేదిక సమర్పించారు. నీటి పారుదల పనుల పర్యవేక్షణను మరింత మెరుగుపరచి, పారదర్శకత, సమర్థత పెంచాల్సిన అవసరం ఉందని, నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఆనకట్టల సమర్థవంతమైన నిర్వహణ, నదుల అనుసంధానం, భూగర్భజల భద్రత విధానాలు భవిష్యత్తులో నీటి భద్రతను పెంచడంలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రధాన ఆనకట్టల వినియోగంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ తీరును వివరించే సమాచారాన్ని కూడా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మైక్రోఇరిగేషన్ విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ గణాంకాలను సేకరించి, వాటిని జాతీయ సదస్సులో ప్రదర్శించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. నదుల పరిరక్షణ, వరద మైదానాల నిర్వహణ, అవక్షేపణ నియంత్రణలో తీసుకుంటున్న చర్యలను జాతీయ వేదికపై వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర సహాయం, నిధుల పెంపుదలకు, రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు మరింత సహకారం పొందేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని ఆయన చెప్పారు. జాతీయ సదస్సులో తెలంగాణ నీటి పారుదల వ్యూహాన్ని దేశవ్యాప్తంగా ప్రదర్శించేందుకు గొప్ప వేదిక కానున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

## ఇండియా ఐక్యసంఘటన అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నారు. ఇండియా ఐక్యసంఘటనకు నాయ కురాలిగా పశ్చిమబెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ ఉండాలని 14 శాతం మంది పేర్కొన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ (9 శాతం), సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ (6 శాతం) ఉన్నారు. సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 343 సీట్లు (2024 ఎన్నికల్లో 292) వస్తాయని, ఇండియా కూటమికి 188 సీట్లు (2024 ఎన్నికల్లో 232 సీట్లు) వస్తాయని అంచనా వేశారు.

## కులగణన దేశానికే రోడ్ మ్యాప్

(మొదటిపేజీ తరువాయి)

కులగణన సమగ్రంగా నిర్వహించామని, ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ గాని కమిటీ గాని వేసి ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు చేరువ చేయాలనే దానిపై కసరత్తు చేస్తామన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని పేర్కొన్నారు. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తిట్టలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీలపై ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నానన్నారు. తన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారన్నారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు.

## సంక్షేమ పథకాలు ఉచితాలెలా అవుతాయి

(మొదటిపేజీ తరువాయి)

తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని కూనంనేని అన్నారు. కాంగ్రెస్, ఆప్... ఈ రెండు పార్టీల స్వయం కృతాపరాధం వల్లే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల నాటికి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే అప్పులు చేసైనా ఇచ్చిన హామీలను కొంత మేర నెరవేర్చాలన్నారు. హామీల అమలుకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేసి, ఎప్పటిలోగా అమలు చేస్తారో ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, తద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూనంనేని సాంబశివరావు సూచించారు.

## ఏడీఈ అక్రమాస్తులు రూ.100 కోట్ల పైనే

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీఈ నివాసంలో స్థిరాస్తి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీశ్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

## వంశీకి కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయనను ఈ కేసులో విజయవాడ పోలీసులు హైదరాబాద్ గచ్చిబౌలిలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే అనేక నాటకీయ పరిణామాల నడుమ రోడ్డు మార్గాన విజయవాడకు తరలించి దాదాపు 8 గంటల పాటు పోలీసులు విచారించారు. అయితే వంశీ నుంచి సరైన సమాధానాలు పోలీసులకు లభించలేదు. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి విజయవాడ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో వంశీని హాజరుపర్చగా, విచారణ జరిపిన కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన వంశీ అనుచరులే విజయవాడ కోర్టు వద్దకు కారులో తీసుకు వచ్చి మళ్లీ తీసుకువెళ్లినట్లుగా పక్కా అధారాలను పోలీసులు సేకరించారు. ఇప్పుడు వంశీ సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటే మరిన్ని ఆధారాలు లభిస్తాయని పోలీసు అధికారులు భావిస్తున్నారు. వంశీని అరెస్టు చేసిన సమయంలో అతని సెల్ ఫోన్ అదృశ్యం కావడం సంచలనంగా మారింది. అందులోనే మొత్తం డేటా ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అందుకే తన మొబైల్‌ను పోలీసులకు అందకుండా మాయం చేసి ఉంటాడని అనుకుంటున్నారు.

## మాలోతు సింధుకు కలెక్టర్ సన్మానం

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం : జాతీయస్థాయి క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తెచ్చిన మాలోతు సింధును జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సన్మానించారు. 38వ జాతీయ క్రీడా పోటీలలో భాగంగా ఫిబ్రవరి 9న ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన 100 రిలే అథ్లెటిక్ విభాగంలో జిల్లాకు చెందిన సింధు కాంస్య పతకం సాధించిన నేపథ్యంలో శనివారం ఈ సన్మానం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారుల్లో దాగిన ప్రతిభ వెలికితీయాలన్నారు. అప్పుడే సింధు లాంటి క్రీడాకారిణిలు ఉద్భావిస్తరన్నారు. జాతీయస్థాయిలో జిల్లా గుర్తింపు తెచ్చినందుకు రూ.25 వెల చెక్కును అందజేశారు. సింధు కోచ్ నరేష్ తోపాటు తండ్రి మాలోతు లక్ష్మణ్ కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి పరంధామ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, డిస్టిక్ ఒలంపిక్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర రావు, న్యూ స్టార్ క్లబ్ ప్రెసిడెంట్ ఎండి. బాబ్జి, తిరుమలరావు పాల్గొన్నారు.

## పరిశ్రమలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమేరాలండాలి : ఎస్పీ

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయ ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. అందుకే జిల్లా పరిధిలోని పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, ఇండ్ల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేసారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆధునిక యుగంలోని టెక్నాలజీతో ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా మారిందని ఎస్పీ అన్నారు. సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా మెరుగుపడతాయన్నారు. దొంగతనాల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయివేటు యాజమాన్యాలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో నమోదైన చాలా కేసుల్లో సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

విశాలాంధ్ర – పినపాక : మండలంలోని సీతంపేట గ్రామం దళిత కాలనికి చెందిన పూస వెంకటేష్ పూరి గుడిసె శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యుట్‌తో పూర్తిగా దగ్ధమైంది. వెంకటేష్ కుటుంబం కట్టుబట్టలతో బయట పడి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, బాధితుడితో చరవాణిలో మాట్లాడి అతని కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు 25 కేజీల బియ్యం, నిత్య అవసర సరుకులు, వంట సామాగ్రి, రూ.2వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారు సాంబయ్య, బాలకృష్ణ, భాస్కర్, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

విశాలాంధ్ర – వనపర్తి : పానగల్ మండలం తెల్ల రాళ్లపల్లిలో రూ. కోటి విలువ చేసే క్రీడా ప్రాంగణం స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ పవన్ కళ్యాణ్ ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ఎర్రజెండాలు, కండువాలు డప్పుల వాయిద్యాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఫయాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, గోపాలకృష్ణ, వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ తదితరులు మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు భూమిని సేకరించి పట్టాలు ఇచ్చి 8 గుంటల భూమిని ప్రజల అవసరాల కోసం (కమ్యూనిటీ పర్పస్) ఖాళీగా పెట్టిందన్నారు. మూడేళ్ల క్రితం ఆ స్థలంలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి ప్రాంగణం చుట్టూ చెట్లను నాటారన్నారు. కోటి రూపాయల విలువైన భూమిపై కన్నేసిన గ్రామానికి చెందిన వ్యక్తులు క్రీడా ప్రాంగణం నేమ్ బోర్డును కూల్చివేసి చెట్లను నరికేసిన ఇంతవరకు వారిపై చర్యలు లేవన్నారు. ఎమ్మార్వో ఎంపీడీవో తదితర అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని అధికారులు చెబుతున్న ఇంతవరకు వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఆర్డీవో కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకువెళ్తామన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ ఆధ్వర్యంలో కళాకారులు పాటలు పాడారు. తెల్ల రాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ కాకం బాలస్వామి, సిపిఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మండల కురుమయ్య, కమ్మావుల పెంటయ్య, లక్ష్మీనారాయణ, కురువ హనుమంతు, సహదేవుడు, వెంగలాయిపల్లి బాలస్వామి, పరంధాములు, వేమన్న, శివకాకం వెంకటమ్మ, కాకం శంకరమ్మ, అంజనమ్మ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర – నేరేడుచర్ల : బిఆర్ఎస్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లావుడ్యా శ్రీను నాయక్ ఆధ్వర్యంలో శనివారం బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను నేరేడుచర్ల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమనికి నేరేడుచర్ల ఎస్ఐ అజిమెరా రవీందర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇట్టి కార్యక్రమంలో మాలోతు శంకర్ నాయక్, భాష నాయక్, బాలు నాయక్, నాగార్జున నాయక్, అభి నాయక్, శ్రీరామ్ నాయక్, బాలకృష్ణ నాయక్. వినయ్ నాయక్, కిరణ్ నాయక్, హరి నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించండి

**రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

విశాలాంధ్ర – హుస్నాబాద్ : పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నరేందర్ రెడ్డిని గెలిపించేందుకు మండలాల వారీగా టీం నాయకులను ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా పట్టభద్రులను కలిసి రావాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నవడ్లకు రూ.500 బోనస్, రెండు లక్షల రుణమాఫీతో పాటు ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలకు మళ్ళీ గుర్తు చేయాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 11790 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1 లక్ష రైతు రుణమాఫీ చేసేందుకు ఐదేళ్ల పట్టిందని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థులు ఓట్లు వేయాలని మండల, గ్రామీణ ప్రాంతాల్లోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, రైతులకు పెన్షన్, ఇస్తామన్న హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి విద్యార్థులకు ట్యూషన్లు చెప్పి, కష్టపడి కాలేజీలు స్థాపించారని పట్టభద్రుడు ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తర తెలంగాణలోని నాలుగు జిల్లాల విద్యావంతులు నరేందర్ రెడ్డిని గెలిపించాలని, లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం పడుతుందని కార్యకర్తలకు, ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, చిత్తారి పద్మ, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి కానరాని విద్యా వ్యవస్థ లోపాలు : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర – కొత్తగూడెం : రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వానికి కల్పించకపోవడం బాధాకరమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ విమర్శించారు. జిల్లాలోని చుంద్రుగొండ మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను, పాఠశాలను వంశీ శనివారం సందర్శించారు. మండల కేంద్రంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో భవనం సరిపోక విద్యార్థుల అవస్థలు పడుతున్నారని చెప్పారు. గదుల పైన పెచ్చులు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితుల్లో విద్యార్థినిలు భయంతో వున్నారన్నారు. మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులపై ఎలుకల దాడి చేసిన విషయం శోచనియమన్నారు. చంద్రుగొండలోని కేజీబీవీ గురుకులంలో విధానలోపాలతో ఇష్టానుసారంగా నడుస్తుందని ఆరోపించారు. అదేవిధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పిటి టీచర్లను నియమించాలని డిమాండ్ చేసారు. హాస్టళ్ల విద్యార్థులకు ప్రతిచోట కోతులు బెండద మండలంలో భయం గొలుపుతున్నట్లు చెప్పారు. సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి తేజ, రామ్, హేమంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకులాల్లో ఉత్తీర్ణత పెంచాలి

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : పాల్వంచలోని తెలంగాణ మైనారిటీ కొత్తగూడెం బాలికల పాఠశాలలో శనివారం అడిషనల్ సెక్రటరీ హాస్టల్ మేనేజ్మెంట్ యుసుఫ్ అలీ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే ప్రభుత్వం మైనారిటీ గురుకులాల్లో పౌష్టికాహారం అందించేందుకు నిధులు పెంచిందని ఆయన అన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని వార్డెన్‌తోపాటు సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి సదుపాయాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం మెరిట్ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ప్రోత్సహించారు. హాస్టల్లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. వంట గదులు, బోధన సౌకర్యలను ఎలావున్నాయో పరిశీలించారు. కాగా ఈ గురుకుల భావనంలో ఉన్న అసౌకర్యాలు, ఇబ్బందులు గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఖమ్మం గురుకుల ప్రిన్సిపాల్, జిల్లా ఆర్ఎల్సీ అరుణకుమారి, అకాడమిక్ కోఆర్డినేటర్ అఫ్రోచ్, ప్రిన్సిపల్ షేక్ ఫర్వీన్ బేగం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కారేపల్లి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరణ

విశాలాంధ్ర – కారేపల్లి : కరోనా సమయంలో కారేపల్లి రైల్వే స్టేషన్‌లో రద్దు చేసిన రిజర్వేషన్ కౌంటర్‌ను రైల్వే అధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఖమ్మం జిల్లాలో ఏకైక రైల్వే జంక్షన్ అయిన కారేపల్లి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ లేకపోవడం వలన గత నాలుగు సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో ఈ రైల్వే లైన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నడుస్తున్నా ఆ రైళ్లకు రిజర్వేషన్ కావాలన్నా, తత్కాల్ టికెట్లు కావాలన్నా ఈ ప్రాంత ప్రజలు ఖమ్మం కొత్తగూడెం లేదా డోర్నకల్ రైల్వే స్టేషన్లకు వెళ్లి రిజర్వేషన్ చేయించుకుని వచ్చి మళ్లీ కారేపల్లిలో రైలు ఎక్కాల్సిన దుస్థితి నెలకొని ఉండేది. దీంతో ఈ విషయమై రైల్వే అధికారులకు పలుసార్లు మొరపెట్టుకోగా ఎట్టకేలకు రైల్వే అధికారులు శనివారం నుండి రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించారు. రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించినందుకు రైల్వే అధికారులకు సహకరించిన ప్రజాప్రతినిధులకు సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ రైల్వే లైన్ లో రద్దు చేసిన మిగతా రైళ్లను కూడా పునరుద్ధరించి డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్డు వరకు గల అన్ని రైల్వే స్టేషన్లలో అన్ని రైళ్లకు హాల్టింగు ఇవ్వాలని సామాజిక కార్యకర్త సురేందర్ రెడ్డి రైల్వే అధికారులను కోరారు.

## కల్వర్టు నిర్మించండి

విశాలాంధ్ర – పరిగి : కల్వర్టు కూలిపోవడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆదుకోవాలని పరిగి మండల పరిధిలోని మాదారం గ్రామం ప్రజలు కోరుతున్నారు. పరిగి మండలం మాదారం గ్రామ ప్రజలు జీలగడ్డ ప్రాంతం వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే ప్రధానంగా మాదారం గ్రామాన్ని అనుకొని ఉన్న వాగు దాటితేనే జీలగడ్డ వ్యవసాయ పొలాలకు వెళ్ళవలసి ఉంటుంది. కానీ అసలు వ్యవసాయ పొలాలకు వాగులో నుంచి పోవాలా వాగులో పడి దెబ్బలు తగులుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికంగా రైతులు ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవ దం లేదన్నారు. గ్రామాన్ని అనుకొని ఉన్న వాగు కల్వర్టు పూర్తిగా పడిపోయింది ప్రతిరోజు రైతులు, ఎడ్లబండ్లు కల్వర్టుపై నుంచి కింద పడుతున్నాయి. రైతుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి మాదారం గ్రామ రైతులకు ప్రజలకు కల్వర్టు మంజూరు చేయాలని కోరుతున్నారు. మాదారం మాజీ సర్పంచ్ నర్సింలు, ఎన్ రోలర్ కృష్ణ, వెంకట్ రెడ్డి, రాములు, మహేందర్, అనిల్, బాలయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మార్గం ఆదర్శనీయం

విశాలాంధ్ర – గార్ల : బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం ఆదర్శనియమని నాయకులు అన్నారు. సేవాలాల్ 286 వ జయంతి వేడుకలు శనివారం గార్ల మండల కేంద్రంలో బంజారాలు, ఉద్యోగస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేసి భోగ్ భండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు మాట్లాడుతూ స్వజాతిని సన్మార్గంలో నడిపిన మహనీయుడన్నారు. హింసాయుత జీవితం పాపమని, మత్తు, దుమపానం శాపమని ఆయన బోధించినట్లు చెప్పారు. సేవాలాల్ ఆదర్శాలు, బోధనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా ప్రజలు, ఉద్యోగస్తులు మాలోత్ శివ నాయక్, గంగావత్ రామ్ సింగ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, భూక్యా నాగేశ్వరావు, మాలోత్ సురేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ లక్ష్మి, వీరు నాయక్, హాతీరామ్ నాయక్, బన్సీలాల్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల ద్వారా పిల్లల సంక్షేమానికి చర్యలు

**అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

విశాలాంధ్ర – కొమరం భీం : జిల్లాలోని కాగజ్ నగర్ మండలం ఈస్గాం మార్కెట్‌లోని సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పిల్లల పోషణ, పారిశుధ్యం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూత్రశాలలు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## మహిళా ఉద్యోగులకు కరాటే తరగతులు

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి, సింగరేణి: శనివారం జీడికె 11వ గని మహిళా ఉద్యోగులకు స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్సులో అవగాహన తరగతులను జీఎం లలిత్ కుమార్ ఆదేశానుసారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఓటుజి ఎం గోపాల్ సింగ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులు భూగర్భ గనిలో పనిచేసే స్థలంలో వీరు మానసిక ఒత్తిడికి గురి కాకుండా అన్ని రంగాలలో ముందు ఉండడానికి స్వీయ రక్షణ ఎంతో అవసరమని అందుకే కరాటేలో అవగాహన కల్పిస్తున్నామని అన్నరు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, మేనేజర్ బి. మల్లేశం, సేఫ్టి అధికారి మెరుపురి మల్లేష్, ఫిట్ సెక్రటరి సుదముల రాజు, సంక్షేమ అధికారి రవీందర్, కుంగ్ ఫు మాస్టర్లు రాజేశం, రాములు పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో కేసీఆర్ సైన్యాన్ని భయపెట్టలేరు : కవిత

విశాలాంధ్ర – బ్యూరో ఖమ్మం : రేవంత్ రెడ్డి ప్రభు త్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో కేసీఆర్ సైనికులను భయపెట్టాలని చూస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు డిసిసిబి డైరెక్టర్ లక్కినేని సురేందర్ ను కలిసేందుకు ఆమె శనివారం ఖమ్మం సబ్ జైలుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు సూదన్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్లాల్ తదితరులతో కలిసి జైలు వద్దే పాత్రికేయులతో మాట్లాడారు. కెసిఆర్ సైనికులను కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో భయపెట్టాలనుకుం టుందని ఎట్టి పరిస్థితుల్లో తమ పార్టీ సైనికులు భయపడబోరని ఆమె అన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లను దుర్విని యోగం చేస్తుందని ఆమె విమర్శించారు. సురేందర్‌పై అక్రమంగా కేసులు పెట్టారని గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసినందుకే ఆయనపై కేసులు మోపారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్న తమ నాయకుల పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆమె విమర్శించారు. పార్టీ ముఖ్య నేతలతో ఆమె రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలనే అంశంపై చర్చించారు.

## రూ.1000 కోట్ల మూలధనం-3 రెట్ల వృద్ధి: ట్రైడెంట్ లక్ష్యం

న్యూఢిల్లీ: దేశీయ టెక్స్‌టైల్స్ రంగంలో అగ్రగామి అంతర్జాతీయ సంస్థ మైట్రైడెంట్ గ్రూప్ 2027 నాటికి భారత వ్యాపారం మూడు రెట్ల వృద్ధి లక్ష్యంగా భారత్ టెక్స్ 2025 వేదికగా ప్రతిష్టాత్మక ప్రణాళికలను నేడు ప్రకటించింది. సుస్థిరత, ఆధునీకరణ, దేశీయ టెక్స్‌టైల్స్, నూలు, ఇంధన వ్యాపారాల్లో ఆస్తుల పెంపు కోసం దూకుడుతో కూడిన ఈ వృద్ధికి ఆర్థిక సంవత్సరం 2025-26లో రూ.1000 కోట్ల మూలధన వ్యయ ప్రణాళికలు సిద్ధం చేసింది. దేశీయ హోమ్ టెక్స్‌టైల్ బ్రాండ్ మైట్రైడెంట్ విస్తరణ అనేది ఈ వృద్ధిలో కీలకంగా నిలవనుంది. ఇందులో భాగంగా లగ్జ్ హోమ్ ఆవిష్కరణ ద్వారా విలాసవంతమైన విభాగంలోకి మైట్రైడెంట్ ప్రవేశించింది. అత్యుత్తమ హస్తకళ, హోమ్ టెక్స్‌టైల్స్‌లో అసమానమైన నాణ్యతను కోరుకునే వివేకవంతమైన వినియోగదారుల అవసరాలను ఈ సరికొత్త శ్రేణి ఆకర్షిస్తుంది. ఈ కలెక్షన్‌లో ఎంపిక చేసిన ప్రీమియం బెడ్డింగ్‌తో పాటు అత్యుత్తమ మృదుత్వం, ఆబ్సార్బెన్సీ, మన్నిక కలిగి ప్రత్యేకంగా రూపొందించిన టవల్స్ కూడా ఉన్నాయి. రూ.4000 నుంచి రూ.40,000ల ధరల శ్రేణిలో ఉన్న లగ్జ్‌హోమ్ ద్వారా అద్భుతమైన నివాసాలకు అత్యుత్తమ సొగసును మైట్రైడెంట్ అందిస్తోంది.

## మార్చి 6-9 తేదీల్లో 'ఇండియావుడ్ 2025'

నెల్లూరు: అగ్రగామి వృత్తిపనులు, ఫర్నిచర్ తయారీ ప్రదర్శన 'ఇండియావుడ్ 2025' మార్చి 6-9 తేదీలలో న్యూఢిల్లీ ఎన్‌సీఆర్ గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్కెట్ అండ్ సెంటర్ (ఐఈఎంఎల్)లో జరుగుతుంది. న్యూయెర్న్‌బర్గ్ మెస్సెస్ ప్రపంచ వ్యాప్త వృత్తి పనుల పోర్ట్‌ఫోలియోలో భాగమైన ఈ ప్రత్యేకమైన మైల్‌స్టోన్ ఎడిషన్, ఇండియాను ఒక తయారీ శక్తిగా, వృత్తిపనులు, ఫర్నిచర్ రంగంలో ఒక ముఖ్యమైన ప్రపంచ నాయకుడిగా వెలుగుచూస్తున్న దిశగా ప్రతిబింబిస్తుంది. ఇండియావుడ్ తన ప్రారంభం నుండి వృత్తిపనుల, ఫర్నిచర్ తయారీ రంగాల విస్తరణలో కీలకపాత్ర పోషించింది. ప్రొడ్యూసర్లు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, వృత్తిపరిశ్రమ ప్రొఫెషనల్స్‌ను ఒక వేదికపైకి తీసుకువస్తున్న ఈ ప్రదర్శన గత రెండున్నర దశాబ్దాల్లో సాంకేతిక అభివృద్ధులు, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, ప్రపంచస్థాయి సహకారాలను పునరుద్ధరించింది.

## టెంపుల్స్ కన్వెన్షన్-ఎక్స్‌పోలో భాగస్వామిగా శ్రీ మందిర్

న్యూఢిల్లీ: ఆలయ పరిపాలన, నిర్వహణలకు అంకితమైన ప్రపంచంలో అతి పెద్ద సదస్సుగా పేరు పొందిన అంతర్జాతీయ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో (ఐటీసీఎక్స్)2025 కోసం ఒక గొప్ప సహకారంలో భాగంగా, శ్రీ మందిర్, భారతదేశపు ప్రముఖ భక్తి సాంకేతిక ప్లాట్ ఫాం అధికారిక టెంపుల్ టెక్నాలజీ భాగస్వామిగా చేరింది. అంత్యోదయ ప్రతిష్ఠాన్ సహకారంతో టెంపుల్ కనక్ట్ ద్వారా నిర్వహించబడే ఐటీసీఎక్స్ 2025, ఫిబ్రవరి 17 నుండి 19 వరకు తిరుపతిలో ఆషా కన్వెన్షన్స్‌లో 58 దేశాల నుండి 1581కి పైగా భక్తి సంస్థల నుండి వచ్చే మిశ్రమ లేదా హైబ్రీడ్ భాగస్వామ్యాన్ని వీక్షించనుంది. 'దేవాలయాల మహా కుంభ్'గా వర్ణించబడిన ఈ కార్యక్రమం 111పైగా వక్తలు, 15ం వర్క్ షాప్స్, విజ్ఞాన సమావేశాలు, 60పైగా స్టాల్స్‌ను చూపిస్తుంది, డిజిటల్ పరివర్తన, సుస్థిరత, పురోగమ ఆలయ నిర్వహణపై ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరిస్తుంది. రూ.6 లక్షల కోట్లకి పైగా ఆలయ ఆర్థిక వ్యవస్థ భారతదేశంలో ఆధ్యాత్మిక పర్యాటకం, ధార్మిక ప్రయమోగానికి గణనీయంగా ప్రోత్సహిస్తోంది.

## ఏఐ ఫీచర్లతో సామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ రిఫ్రిజిరేటర్ సిరీస్ విడుదల

గురుగ్రామ్: భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తాజాగా 330లీటర్, 350లీటర్ సామర్థ్య శ్రేణిలో దాని తాజా బెస్పోక్ ఏఐ రిఫ్రిజిరేటర్ సిరీస్‌ను విడుదల చేసింది. ఈ కొత్త శ్రేణి ఏఐ ఎనర్జీ మోడ్, ఏఐ హోమ్ కేర్, స్మార్ట్ ఫార్వర్డ్ వంటి అధునాతన ఏఐ-ఆధారిత లక్షణాలను సొగసైన డిజైన్‌లు, బహుముఖ నిల్వ ఎంపికలతో అందిస్తుంది. భారతీయ వినియోగదారుల ప్రత్యేక అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ సిరీస్, కార్యాచరణ, శైలి, ఆవిష్కరణల సామరస్యపూర్వక మిశ్రమాన్ని అందిస్తుంది. కొత్త బెస్పోక్ ఏఐ రిఫ్రిజిరేటర్లు స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్, మెరుగైన ఫ్రెష్‌నెస్ నిలుపుదల, యాక్టివ్ ఫ్రెష్ ఫిల్టర్‌ను అందిస్తాయి, ఇది 99.9% వరకు హానికరమైన బ్యాక్టీరియాను తొలగిస్తుంది, ఇవన్నీ సొగసైన మరియు అనుకూలీకరించదగిన బాహ్య భాగంలో చుట్టబడి ఉంటాయి. 20 సంవత్సరాల వారంటీతో, డిజిటల్ ఇన్వర్టర్ కంప్రెసర్‌తో, ఈ సిరీస్ ఆధునిక శీతలీకరణను పునర్నిర్వచించనున్నది.

## 18న హైదరాబాద్‌లో ఎస్ఐ-గ్లోబల్ ఇండియా గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్

హైదరాబాద్: ఎస్ఐ-యూకే ప్రారంభించిన, అంతర్జాతీయ విద్యా అవకాశాలను అందించే ప్రముఖ సంస్థ ఎస్ఐ-గ్లోబల్ ఇండియా, హైదరాబాద్‌లో ఒక రోజంతా గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ఫెయిర్ 2025 ఫిబ్రవరి 18న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగనుంది. వేలాది మంది విద్యార్థులకు ప్రతిష్టాత్మకమైన యుకె కళాశాలల్లో ప్రవేశం పొందడంలో ఎస్ఐ-గ్లోబల్ ఇండియా సహాయపడింది. అడ్మిషన్ విధానాలు, స్కాలర్‌షిప్‌లు, వీసా అవసరాలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యక్ష సమాచారాన్ని అందించడం ద్వారా, గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2025 విద్యార్థులకు తగు సమాచారంతో విద్యా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయం చేయడానికి ప్రయత్నిస్తుంది. ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల నుండి ప్రతినిధులు వారి విద్యా కార్యక్రమాల గురించి లోతైన సమాచారాన్ని అందిస్తారు.

## గిల్ట్-ఫ్రీ బెంటో కేక్‌లను పరిచయం చేసిన యమ్మీ బీ

హైదరాబాద్: భారతదేశంలోని ప్రముఖ కేఫ్ చైన్ యమ్మీ బీ వాలెంటైన్స్ డే కోసం తన ఉత్తేజకరమైన బెంటో కేక్‌ల లభ్యతను ప్రకటించింది. శుద్ధి చేసిన పిండి (మైదా), గ్లూటెన్ లేదా ప్రిజర్వేటివ్‌లు లేకుండా రూపొందించిన ఈ రుచికరమైన ఒకే ఒక్క సర్వ్ కేక్‌లు ఇప్పుడు హైదరాబాద్‌లోని యమ్మీ బీ అవుట్‌లెట్లలో అందుబాటులో ఉన్నాయి. జూబ్లీ హిల్స్, కొండాపూర్, కోకాపేట్, కూకట్‌పల్లిలోని యమ్మీ బీ లొకేషన్లలో కస్టమర్లు ఈ ఆహ్లాదకరమైన క్రియేషన్లను ఆస్వాదించవచ్చు. లేదా సౌకర్యవంతమైన డెలివరీ కోసం ఆన్‌లైన్‌లో ప్రీ-ఆర్డర్ చేయవచ్చు. తమ కస్టమర్ల అభిరుచికి ప్రతిబింబించే ఉత్పత్తిగా దీన్ని పరిగణిస్తున్నట్లు యమ్మీ బీ వ్యవస్థాపకుడు, సీఈఓ సందీప్ జంగాలా తెలిపారు.

## బంధన్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్ మదుపరులకు అనుకూలం

ముంబయి: బంధన్ మ్యూచువల్ ఫండ్ ఒక నూతన ఇండెక్స్ పథకాన్ని ఇటీవల ఆవిష్కరించిన విషయం తెల్సిందే. బంధన్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.1000. ప్రధానంగా లార్జ్ క్యాప్ తరగతికి చెందిన షేర్లు నిఫ్టీ నెక్ట్స్ 50లో ఉంటాయి. ఇటీవల స్టాక్ మార్కెట్ సూచీలు బాగా దిద్దుబాటుకు లోనైన విషయం విదితమే. దీనికి తగ్గట్లుగా నిఫ్టీ నెక్ట్స్ 50 షేర్ల ధరలూ తగ్గాయి. అందువల్ల నిఫ్టీ నెక్ట్స్ 50 షేర్లలో కొత్తగా పెట్టుబడి పెట్టాలనుకునేవారికి ఇది సరైన సమయమే అవుతుంది. మూడు నుంచి ఐదేళ్లపాటు పెట్టుబడి పెట్టే ఆలోచన ఉన్న మదుపరులు దీన్ని పరిశీలించవచ్చు.

## గూగీ గ్రూప్ ప్రెజెంట్స్ బాడీబిల్డింగ్ విజేతలకు సన్మానం

హైదరాబాద్: గూగీ గ్రూప్ ప్రెజెంట్స్ ఆధ్వర్యంలో బాడీబిల్డింగ్ విజేతలకు సన్మానం చేశారు. తెలంగాణా స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి సహకారంతో షఫీ సామి క్లాసిక్ ద్వారా తెలంగాణ ఫిట్నెస్ ఫెస్టివల్, యువతను ప్రోత్సహించడానికి, ఆరోగ్య విద్యను ప్రోత్సహించడానికి షోలో ఆయన ఉన్నారు. తెలంగాణ నుండి తమటాప్ త్రీ ఫైనలిస్ట్ ఓం సింగ్ బాడీబిల్డింగ్ విజేత. ఢిల్లీకి చెందిన క్లాసిక్ ఫిజిక్ హైదర్ మాలిక్. తెలంగాణ నుండి పురుషుల ఫిజిక్ షోహైబ్, మిట్టు సాయి ఫిషర్ కమిటీ చైర్మన్ సమక్షంలో కార్వాన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్ ఛార్జి ఉస్మాన్ అల్‌హజ్రి, మలక్పేటకంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్ ఛార్జి షేక్ అక్బర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రీన్ తెలంగాణ సమ్మిట్ 2025 మొదటి ఎడిషన్ విజయవంతం

హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) గ్రీన్ తెలంగాణ సమ్మిట్ 2025 మొదటి ఎడిషన్‌ను హెచ్ఐసిసి, నోవాటెల్, హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా స్థిరమైన భవన నిర్మాణ పద్ధతులను చర్చించి ప్రోత్సహించేందుకు బిల్డర్లు, డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్‌లతో పాటు ప్రభుత్వం నుండి కీలకమైన వాటాదారులను "కలిసి సుస్థిర భవిష్యత్తును నిర్మించడం-పీపుల్ సెంట్రిక్ అప్రోచ్" అనే సమ్మిట్‌లో సమావేశం జరిగింది. ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఇ విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

# ధన్కర్ అప్రస్తుత ప్రసంగం

ఉప రాష్ట్రపతి, ఆ హోదాలో రాజ్యసభ అధ్యక్షులు జగదీప్ ధన్కర్ మాటలు దొర్లించడంలో గొప్ప దిట్ట. ఆయన ఏం మాట్లాడతారో చాలా సందర్భాలలో అంతుపట్టని వ్యవహారంగా మిగిలి పోతుంది. నోరు తెరిచినప్పుడల్లా వివాదాస్పద ప్రకటనలే చేస్తుంటారు. ఇలాంటి ప్రకటనలు చేయడానికి ఆయన లక్ష్యం అవసరం ఉన్నా లేకపోయినా మోదీ ప్రభుత్వాన్ని వెనకేసుకు రావడమేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన రాజ్యసభను నడుపుతున్న తీరు విచిత్రంగా ఉంటోంది. సభ్యులు ఏం మాట్లాడినా ఇది రికార్డులలోకి వెళ్లదు అంటూ ఉంటారు. సభ్యులు ఏ విషయమైనా మాట్లాడితే దీనిని ధ్రువ పరచండి, ప్రామాణీకరించండి అంటూ ఉంటారు. సభలో ఏ విషయాన్నైనా లేవనెత్తే అధికారం పార్లమెంటు సభ్యులకు ఉంటుందన్న మౌలిక విషయాన్ని కూడా ఆయన అంగీకరించరు. సభలో మాట్లాడే మాటలు, అవి ఎవరి మీద అయినా అవి పరువు నష్టం కిందకు రావు అనే వాస్తవాన్ని కూడా ధన్కర్ అంగీకరించరు. సభకు ఆవల ఆయన ఎక్కడైనా మాట్లాడినా ఇదే తంతు కొనసాగుతుంది. అలాగని ఆయనకు విషయ పరిజ్ఞానం లేక కాదు. ఆయనకు న్యాయవాదిగా మంచి పేరే ఉండేది. కానీ ఆ కీర్తినంతా ఆయనే చేజాతులా నాశనం చేసుకోవడంలో అద్వితీయుడనిపించుకుంటున్నారు. తన పరిధిలోకి రాని అంశాల మీద కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. ఆ తరవాత నాలుక కరుచుకునే అలవాటు కూడా ఆయనకు లేదు. తమ ప్రభుత్వాన్ని ఎలా సమర్థించుకోవాలో మంత్రులు ధన్కర్ నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు. ఆయన మాటలు వారికి మంచి పాఠ్యాంశాలుగా ఉపయోగ పడ్తాయి. తన మాటలకు తనను తానే అభినందించుకోవడంలో ఆయనతో పోటీ పడగలవారెవరూ లేరు. ఆయన ఈ మధ్య భోపాల్‌లో జాతీయ జ్యుడీషియల్ అకాడెమీ ఏర్పాటు చేసిన ఒక సభలో మాట్లాడిన మాటలు తీవ్ర వివాదం రేకెత్తించాయి. సీబీఐ డైరెక్టర్‌ను, ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాత్ర ఎందుకు ఉండాలి అని ఆయన ప్రశ్నించారు. ఈ నియామకాల్లో అసలు సుప్రీంకోర్టు పాత్ర ఏముంటుంది అని కూడా ఆయన ప్రశ్నించారు. ఇది ఆయన అమాయకంగా వెలిబుచ్చిన అభిప్రాయం ఏమీ కాదు. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించే కమిటీలో ఇంతకు ముందు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండేవారు. డి.వై.చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉండగానే మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించే కమిటీలో ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చేసింది. ప్రధాన న్యాయమూర్తి బదులు ప్రధాని తన మంత్రివర్గంలోని ఒక మంత్రికి ఆ కమిటీలో స్థానం కల్పించడానికి అనువుగా నిబంధనలనే మార్చేశారు. ఇంకేముంది? మోదీ రామ భక్త హనుమాన్ లాంటి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మోదీ ఆ కమిటీలో ఓ కుర్చీ వేసేశారు. ఆ కమిటీలో ప్రతిపక్ష నాయకుడు ఉండే మాట నిజమే. కానీ ప్రభుత్వ పక్షాన ప్రధానితో సహా ఒక మంత్రి ఉన్నప్పుడు, ఆ కమిటీలో ఉన్నదే ముగ్గురు సభ్యులైనప్పుడు ప్రతిపక్ష నాయకుడి మాటకు ప్రభుత్వం తీసుకునే నిర్ణయంలో ఏ పాత్రా ఉండడానికి అవకాశమే లేదుగా! ప్రస్తుత ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి రాజీవ్ కుమార్ వచ్చే మంగళవారం ఉద్యోగ విరమణ చేస్తారు. అంటే ఆయన స్థానంలో మరొకరిని అయినా నియమించాలి లేదా రాజీవ్ కుమార్ నిష్క్రమణ తరవాత మిగిలే ఇద్దరిలో ఒకరిని ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించి మరో కమిషనర్‌ను నియమించి ఆ ఖాళీ భర్తీ చేయాలి. ఈ మహత్కార్యం కోసం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఉండే ఈ కమిటీ సమావేశం సోమవారం జరగనుంది. అంటే సరిగ్గా ఒక్క రోజు ముందు ఎంపిక కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటుంది. ఈ సమావేశానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హాజరు కావాల్సి ఉంది. ఆయన హాజరవుతారని కూడా అంటున్నారు. అయితే ఆయన ఏం మాట్లాడినా, భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినా, ప్రత్యామ్నాయంగా మరో అధికారి పేరు సూచించినా దాన్ని ప్రధాని,హోం మంత్రి కలిసి ఆ ప్రతిపాదనను తోసిపుచ్చగలరు.

ఎన్నికల కమిషన్ నియామక కమిటీతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఏం పని అని ధన్కర్ అనడం వెనక కమిటీ సమావేశం జరగడం ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించే కమిటీలో ఏం పని అని ప్రశ్నించిన ధన్కర్ అసలు ఈ విషయంలో వ్యాఖ్యానించ వలసిన అగత్యం తనకేమిటి అన్న ఆలోచన మాత్రం కలగ లేదు. కలగదు. ఎందుకంటే మోదీ ప్రభుత్వాన్ని సమర్థించడమే ధన్కర్ పనిగా పెట్టుకున్నారు. అది తన పవిత్ర కర్తవ్యంగానో, విధ్యుక్త ధర్మంగానో భావిస్తున్నట్టున్నారు. ఉపరాష్ట్రపతి హోదా, రాజ్యసభ అధ్యక్ష హోదా రాజ్యాంగ పరమైనవి అన్న ఆలోచనే ధన్కర్‌కు రాదు. స్వామి భక్తి ముందు ఈ ధర్మ సూక్ష్మాలు ఆయన మదికి తట్టవు కాబోలు. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని ఎంపిక చేసే కమిటీలో ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలన్న సంప్రదాయం సుప్రీంకోర్టు ఆదేశం మేరకే అమలులోకి వచ్చింది. ఆ కమిటీలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌నే మోదీ ప్రభుత్వం భరించలేక పోయింది. సీబీఐ డైరెక్టర్ ను, ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించే కమిటీలలో ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలన్నది మునుపటి నియమం. సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ నుంచి కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారో లేదో. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిష్పక్షపాతంగా ఉంటారన్న అభిప్రాయంతో ఆ పదవిలో ఉన్న వారిని కూడా ఈ కమిటీల్లో నియమించారు. కానీ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఎంత నిష్పక్షపాతంగా ఉన్నారో అందరికీ తెలుసు. తాము అధిష్ఠించిన స్థానం రాజ్యాంగ పరమైందని, అందువల్ల హుందాగా వ్యవహరించాలని అనుకునే వారే కరవైపోతున్న దశలో ఉప రాష్ట్రపతి ధన్కర్ ఆ కమిటీల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఏం పని అంటున్నారు. జగదీప్ ధన్కర్‌కు రాష్ట్రపతి కావాలన్న ఆకాంక్ష ఉండొచ్చు. కానీ ప్రస్తుత రాష్ట్రపతి లాగే ఆయన కూడా 2022లోనే ఉప రాష్ట్రపతి అయ్యారు. అంటే కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవడానికి ఇంకా చాలా సమయం ఉంది. కానీ ఏలిన వారిని ప్రసన్నం చేసుకుంటే అప్పుడైనా తనను గుర్తుంచుకుంటారని ధన్కర్ ఆశపడ్తున్నట్టున్నారు. పాపం!

# రంగరాజన్‌పై దాడి దేనికి సంకేతం?

నేటి సమాజం విద్యా విజ్ఞానాల పరంగా ఎంత ప్రగతి సాధించినా, నైతిక, సామాజికపరంగా తిరోగమనంలోనే పయనిస్తోంది. నేడు సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, సద్భావన, మానవీయ విలువలు అడుగంటి పోతున్నాయి. అశాంతి, అలజడులు, అనుమానం, అభద్రతాభావం, అమానవీయం తాండవ మాడుతున్నాయి. కులం, మతం పేరుతో ఉన్మాదం పెరుగుతోంది. ఇప్పుడు చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ వంతొచ్చింది. ఆయనపై దాడి దేనికి సంకేతం? వృత్తిరీత్యా రంగరాజన్ బ్రాహ్మణ పూజారి అయినప్పటికీ గొప్ప లౌకికవాది, పదహారణాల ప్రజాస్వామ్యవాది. మతోన్మాదం, పరమత ద్వేషం రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో ఆయన బురద గుంటలో తామర పువ్వులా తళుక్కున మెరుస్తున్నారు. పరమత సహనం కలిగి, మతసామ రస్యాన్ని మనసారా కోరుకునే మనిషాయన. అందుకే మతతత్వ మూకలు ఆయన్ని లక్ష్యం చేసుకున్నాయి. అంటే ఈ దేశంలో లౌకికవాదులు, ప్రజాస్వామ్య వాదులు, మతసామరస్యం కాంక్షించేవారు స్వమతం వారైనప్పటికీ వదిలిపెట్టబోమని ఈ మతోన్మాద శక్తులు చెప్పకనే చెబుతున్నాయన్నమాట. 'రామరాజ్యం' పేరుతో రాక్షసత్వానికి తెరలేపి, దూషించే, ద్వేషించే స్థాయి నుంచి ఏకంగా దాడిచేసే వరకు పరిస్థితి వెళ్లిపోయింది.

తన ధర్మంపై స్థిరంగా ఉంటూనే, తమ ధర్మోన్నతికై పాటుపడుతూనే ఇతర మతాలను గౌరవించే రంగరాజన్ లాంటి లౌకిక, ప్రజాస్వామ్య వాదులను భయభ్రాంతులకు గురిచేసి, ఇలాంటి వారిని కూడా తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలనేది ఈ దుర్మార్గుల దుష్ట పన్నాగం కావచ్చు. సంకుచిత మనస్తత్వం, కులతత్వం, మతోన్మాదం, మూకోన్మాదం దేశంలో ఎంతగా పెచ్చరిల్లిందో మనం కళ్లారా చూస్తున్నాం. తమ స్వార్థపూరిత, ఉన్మాద కార్యకలాపాలకు సహకరించకపోతే ఈ మతోన్మాదులు ఎవరినీ వదిలిపెట్టరనడానికి ఈ దాడి ఓ ఉదాహరణ. ఇంతటి విద్వేష పూరిత దాడిని కూడా సమర్థించేవాళ్లు మనచుట్టే ఉన్నారంటే ఒకింత ఆశ్చర్యం కలుగుతోంది. అది కూడా బ్రాహ్మణ సమాజం నుంచే సుమా! రంగరాజన్ బ్రాహ్మణుడై ఉండి, బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడై ఉండి దళితుడిని గుడి ప్రవేశం ఎలా చేయించగలుగుతాడు? ఒక ముస్లిం రైతుకు ఎద్దును ఎలా ఇవ్వగలుగు తాడు? గుడిలో హుండీ తీసివేయడం ఆయన ఇష్టమేనా? ఇలాంటి అనేక హిందూ ధర్మ వ్యతిరేక పనులు ఆలయ పూజారి సీఎస్ రంగరాజన్ చేస్తున్నాడు కాబట్టే ఆయనపై దాడి జరిగింది తప్ప, ఊరకనే జరగలేదు. రామరాజ్య స్థాపకుడు వీరరాఘవరెడ్డి చేసింది కరెక్టు కానప్పటికీ, అందులో న్యాయం ఉంది అంటున్నాడు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు. రంగరాజన్‌ను, ఆయన చేసే ఇలాంటి పనులను వ్యతిరేకించే వారు చాలా మంది ఉన్నారు. ఎవరో ఒకరు ముందుకు రావాలి కాబట్టి వీరరాఘవరెడ్డి ముందుకొచ్చాడు అని సెలవిచ్చాడు ఈ బ్రాహ్మణోత్తముడు. అంతేనా... బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా రంగరాజన్‌పై దాడి చేసిన వీర రాఘవరెడ్డిని సమర్థించినట్లు మాట్లాడాడు. అంటే, ఇదేదో యాధృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదని, దీనివెనుక సంఘ్ పరివార్ భావజాలం కలిగిన పెద్ద ముఠానే ఉన్నదని అర్థమవుతోంది. ఈ ఖండనముండనలన్నీ కేవలం ప్రజల్ని మభ్య పెట్టడానికే తప్ప మరేమీకాదు. ముందుముందు మరెన్ని మతోన్మాద ఉపద్రవాలు చూడవలసి వస్తుందో తలచుకుంటేనే భయమేస్తోంది. మంచి, మానవత్వం, శాంతీ, ప్రేమ, సదాచారం, సద్భావన రోజురోజుకూ మంటకలిసి పోతున్నాయి. నిజానికి మంచి, మానవత్వానికి మించిన ధర్మం మరొకటిలేదు. రామరాజ్యం పేరుతో మానవత్వాన్ని మంటగలుపుతూ, తామేదో ధర్మాన్ని ఉద్ధరిస్తున్నామని అనుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. దేవుని పేరుతో దానవత్వం మానవతకు వ్యతిరేకం. భువిపై మానవ ఉనికి మానవత్వాన్ని కాపాడడానికి, సమాజంలో సామరస్యాన్ని, సద్భావనను పెంపొందించడానికి, న్యాయ స్థాపనకని ధర్మం చెబుతోంది. మానవీయ విలువల కోసం పాటుబడే వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించే దైవం, శాంతీ, సామరస్యాలకు తూట్లు పొడుస్తూ మానవత్వాన్ని ఖూనీ చేసే దుర్మార్గులను ఊరికే వదిలిపెడతాడా?

ఎప్పుడైతే మానవుడు సాటిమనిషి గురించి ఆలోచించడం, వారి యోగక్షేమాలు పట్టించుకోవడం, సత్సంబంధాలు నెరపడం, సద్భావనతో, సామరస్యంతో మసలుకోవడం, సమాజంలో న్యాయ స్థాపనకై ప్రయత్నించడం మానేశాడో అప్పుడే సమాజం పెడద్రోవ పట్టింది. మానవ హృదయంలో అతి పవిత్రంగా ఉండవలసిన మానవత్వానికి తుప్పు పట్టింది. హృదిలో స్వార్థం పురుడు పోసుకొని ఉన్మాద లక్షణాలు ప్రస్ఫుటమయ్యాయి. తత్ఫలితంగా పరివార్ సృష్టించిన అనేకమంది వీరరాఘవ రెడ్లు పుట్టుకొచ్చారు. ఇలాంటి ఉన్మాద మూకల వెనుక ఉన్నశక్తుల రహస్యాన్ని ఛేదించ వలసిన అవసరం ఉంది. 'రామరాజ్యం' అర్థం కూడా తెలియని రాక్షసమూక దేశంపైపడి అరాచకాలకు తెరలేపింది. ప్రశాంత చిత్తంతో, భక్తిభావంతో పలకవలసిన 'జైశ్రీరామ్' అనే నామం సాటి మనిషిని చంపే యుద్ధ నినాదంగా మారిపోయింది. శాంతి భద్రతలు కరువైపోయాయి. శాంతి, సామరస్యం, సదాచారం, సహజీవనం, సద్భావన, ప్రేమ, మానవీయతలకు విఘాతం కలిగింది. నిజానికి మత విశ్వాసమనేది మానవులు శాంతియుతంగా, సామరస్యంతో, సోదర భావంతో, సద్భావనతో సహజీవనం చేయడానికి దోహదపడాలి. మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించడానికి అది సాధనం కాకూడదు.

భిన్నత్వంలో ఏకత్వం గల మనదేశంలో సర్వమానవ సహిష్ణుతాభావం, పరస్పర సదవగాహన, సద్భావన జన సామాన్యంలో అంతర్వాహినిలా ప్రవహించాలి. ఒకరినొకరు, ఒకరి మతాన్నొకరు గౌరవించుకుంటే మనుషుల మధ్య, మనసుల మధ్య దూరాలు, వైరాలు తగ్గి మత సామరస్యం వెల్లివిరుస్తుంది. సంఘ శ్రేయోభిలాషులు, ఆధ్యాత్మిక పెద్దలు, సామాజిక కార్యకర్తలు, మంచిని, శాంతిని, మానవతను కాంక్షించే ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచి, కలిసి కృషి చేస్తే, ఇలాంటి మతోన్మాదులను కట్టడి చేయడం, సమాజంలో శాంతీ సామరస్యాలను, సోదరభావాన్ని, సద్భావనను పెంపొందించుకోవడం, మానవతను కాపాడుకోవడం, అసంభవం ఏమీకాదు. ఇది ఈనాటి అవసరం.

**ఎండి. ఉస్మాన్ ఖాన్**
**సీనియర్ జర్నలిస్ట్**

# గరిమనాభిపై కృష్ణ జలాలు పంపిణీ

వి. శంకరయ్య

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణానదీజలాల పంపిణీ పంచాయతీ తుది దశకు చేరుకున్నది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తాజాగా ఇచ్చిన ఆదేశాలు తమకు అనుకూలంగా వున్నాయని తెలంగాణ సంబర పడుతోంది. ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వ్యవహరిస్తే అది భ్రమ మాత్రమే. ట్రిబ్యునల్ నియామకమే చట్ట విరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించేందుకు సిద్ధం కావడం శుభ పరిణామమే. ఇంత రాద్ధాంతానికి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య కారకుడైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన స్వార్థానికి అవకాశాన్ని ఉపయోగించుకొని ట్రిబ్యునల్ నియమించింది. 2020లో జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ ట్రిబ్యునల్ ప్రతిపాదన పెట్టినప్పుడు ముఖ్యమంత్రిగా సమావేశంలో పాల్గొన్న జగన్మోహన్ రెడ్డి డిసెంట్ నోట్ పెట్టి వుంటే కేంద్ర ప్రభుత్వానికి అవకాశం వుండేదికాదు. గమనార్హమైన అంశమేమంటే తదుపరి మూడేళ్లు దస్త్రాలకే పరిమితం చేసిన కేంద్ర ప్రభుత్వం 2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజల మన్ననలు పొందేందుకు అంతర్ రాష్ట్ర జల వివాదచట్టం సెక్షన్ 3 కింద ఆపాటికే పనిచేస్తున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. మున్ముందు ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ వలన గతంలో బచావత్ ట్రిబ్యునల్ అవశేష ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపుల్లో ఏదైనా మార్పులు జరిగితే రాష్ట్ర ప్రజల ముందు బోనులో జగన్‌మోహన్ రెడ్డితో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముద్దాయిలుగా నిలబడ వలసి ఉంటుంది. అంతర్ రాష్ట్ర జలవివాద చట్టం సెక్షన్ 3 కింద కేంద్రం జారీ చేసిన గెజెట్‌పై ముందుగా ట్రిబ్యునల్ విచారణ చేపట్టడమే తెలంగాణ సంబరానికి ప్రాతిపదికగా వుంది.

సెక్షన్ 3 సబ్‌సెక్షన్(ఎ)లో నదీ జలాల వివాదానికి చెంది ఏదైనా రాష్ట్రం కార్యనిర్వాహక చర్య లేక కొత్త చట్టం ప్రతిపాదించినా లేక ఆమోదించినా నష్టం కలిగే రాష్ట్రం కేంద్రానికి ఫిర్యాదుచేస్తే ట్రిబ్యునల్ నియామకం జరుగుతుంది. కృష్ణానదీజలాల వివాదానికి చెంది అవశేష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎట్టి కార్యనిర్వాహక చర్య లేక చట్టం ఆమోదించలేదు. సాక్షాత్తు పార్లమెంటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజనచేస్తూ చట్టం ఆమోదించింది. విభజన చట్టంలో నదీ జలాల వివాదానికి చెంది అనువైన సెక్షన్‌లు పొందుపర్చింది గాని కొత్త ట్రిబ్యునల్ ప్రతిపాదన విభజన చట్టంలోలేదు. ఈ చర్య నదీజలాల వివాదానికిచెంది పార్లమెంటు ప్రతిపత్తిని ధిక్కరించడమే అవుతుంది. ఒకవేళ తెలంగాణాకు రాష్ట్ర విభజన చట్టం ద్వారా నదీ జలాలకు చెందిన సెక్షన్లలలో అన్యాయం జరిగి వుంటే తిరిగి పార్లమెంటులో చట్టం సవరించేందుకు యత్నం చేయాలి. గాని కేంద్ర ప్రభుత్వానికి మరొక ట్రిబ్యునల్ నియమించే అధికారంలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ కీలకాంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం లేదు కాబట్టి కనీసం సుప్రీంకోర్టులో తేల్చుకోవలసి వుంది. బహుశా సుప్రీంకోర్టు కూడా న్యాయపరమైన ఈ అంశం దృష్టిలో పెట్టుకొని ట్రిబ్యునల్ తీర్పు తమ తీర్పుకు లోబడి వుంటుందని గతంలోనే చెప్పి వుంది.



> **కేంద్ర జల వనరుల శాఖాధికారుల సమక్షంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని అవశేష ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తోంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 85 మేరకు యాజమాన్యం బోర్డు అధీనంలోనికి ప్రాజెక్టులు అనుబంధ అవుట్‌లెట్‌లు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా, ఆంధ్రప్రదేశ్ అంగీకరించినా ఈనాటికి తెలంగాణ సిద్ధం కావడంలేదు.**

ఇక సెక్షన్ 3 సబ్‌సెక్షన్(బి) లో ఇలా వుంది. ఏదైనా రాష్ట్రం నీటి విడుదలలో వైఫల్యం చెందిన సందర్భంలో తగు న్యాయానికి ఏదైనా రాష్ట్రం ట్రిబ్యునల్ నియామకం కోరవచ్చు. ప్రస్తుతం కృష్ణా నదీజలాల పంపిణీ మొత్తంగా కృష్ణానదీ యాజమాన్యం బోర్డు అధీనంలో వుంది. అవశేష ఆంధ్రప్రదేశ్ అడ్డు పడుతున్న సందర్భంలేదు. సెక్షన్ 3 సబ్ సెక్షన్(సీ) లో నీటి పంపిణీలో ఏదైనా ఒప్పందాన్ని అమలు చేయడంలో ఏదైనా రాష్ట్రం వైఫల్యం చెందితే కేంద్రం ట్రిబ్యునల్ నియామకం చేయవచ్చు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత అవశేష ఆంధ్రప్రదేశ్ అట్టి చర్యకు తలపడలేదు. కేంద్ర జల వనరుల శాఖాధికారుల సమక్షంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని అవశేష ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తోంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 85 మేరకు యాజమాన్యం బోర్డు అధీనంలోనికి ప్రాజెక్టులు అనుబంధ అవుట్‌లెట్‌లు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా, ఆంధ్రప్రదేశ్ అంగీకరించినా ఈనాటికి తెలంగాణ సిద్ధం కావడంలేదు. ఇంత బరితెగించిన తెలంగాణ మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కినట్లు వ్యవహరిస్తున్నా రాజకీయ ప్రయోజనం లేనిదే పిల్లికి కూడా భిక్షంపెట్టని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో తన స్వార్థం కోసం కొత్త ట్రిబ్యునల్ నియమించి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసింది.

వాస్తవానికి 2015లోనే కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం సెక్షన్ 89 మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ గడువు పెంచుతూ బాధ్యతలు అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన నాటికి అంతర్ రాష్ట్ర జలవివాద చట్టం కింద నియమించిన ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయకుండా మిగులు నీళ్లు వుంటే రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని నీటి ఎద్దడి రోజుల్లో ప్రొటోకోల్ నిర్ణయించాలని రాష్ట్ర విభజన చట్టం 89 సెక్షన్ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ట్రిబ్యునల్‌కు అప్పగించింది. 2004 లో నియమించి 2013 లో ఇచ్చిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిపై కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చినందున ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ తీర్పు మాత్రమే అమలులో వుంది. విభజన చట్టం సెక్షన్ 89 మేరకు విచారణ మొదలు పెట్టిన ట్రిబ్యునల్ ముందు రెండు రాష్ట్రాలు విచారణ అంశాలను సమర్పించగా మొదట్లోనే తెలంగాణకు చెంది 18 అంశాలు, ఏపీకి చెందిన 13 అంశాలు పరిగణన లోకి తీసుకొన్నది. ట్రిబ్యునల్ ముందు గాని రాజకీయంగా గాని తెలంగాణ బేసిన్ సమస్య తరచూ ముందుకు తెస్తోంది. దీనితో పాటు పరీవాహక అంశం ప్రముఖంగా వాదిస్తోంది. అయితే తాను మాత్రం గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు భేషుగ్గా తరలిస్తోంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకతీయ కాలువ గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్ వచ్చినదే. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వెలికితీస్తున్న ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ఏ కోవకు చెందినది? కృష్ణా యాజమాన్య బోర్డు ప్రతి సమావేశంలో పరీవాహక ప్రాంతం అంశం తీసుకువచ్చి కనీసం ఫిఫ్టీ ఫిఫ్టీ పద్ధతిలో నీటి పంపిణీ జరగాలని తెలంగాణ అధికారులు పట్టుబట్టడం రివాజు అయింది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 85 సబ్ సెక్షన్ 8 (ఏ) (1)మేరకు ప్రస్తుతం అమలులో వున్న బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులే అమలు కావలసివుంది. పైగా ఆంధ్రప్రదేశ్‌లో గొంతెండిపోతున్న రాయలసీమ కృష్ణాబేసిన్ ఆవలవుందని బచావత్ ట్రిబ్యునల్ కేసీ కెనాల్‌కు తుంగభద్ర ఎగువ కాలువకు కేటాయించిన నీళ్లు తమకు కేటాయించాలని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు సమర్పించి ఆమోదించిన జాబితాలో పొందు పర్చింది. అమరావతిలో రాజధాని నిర్మిస్తున్నందున సీఆర్‌డీఏ ప్రాంతంలో మిగిలే నీటికి ఎసరు పెట్టింది.

ఇటీవల కాలంలో కేంద్ర జలసంఘం మాజీ సభ్యులు చేతన్ పండిత్‌ను తన సాక్షిగా ప్రవేశపెట్టి ట్రిబ్యునల్‌లో అదనపు అఫిడవిట్ సమర్పించి క్యారీ ఓవర్ కింద వుండే 150 టీఎంసీల్లో 125 టీఎంసీలు తమకు కేటాయించాలని కోరింది. మరొక గొంతెమ్మ కోర్కె ఏమంటే పోలవరం ద్వారా వచ్చే 80 టీఎంసీల్లో 35 టీఎంసీలు ఎగువ రాష్ట్రాలకు పోగా మిగిలిన 45 టీఎంసీలు తమకు చెందుతాయని వాదన తెచ్చింది. ఇవన్నీ ఏ ప్రాతిపదికన కోరారో వివరణ లేదు. తాజాగా ట్రిబ్యునల్ ముందు మరికొన్ని అంశాలు తెలంగాణ తీసుకువచ్చింది. గోదావరి నుంచి కృష్ణా బేసిన్ వచ్చే జలాలను చూపి కృష్ణాజలాల వాటాలో కోత పెట్టేందుకు యత్నిస్తోంది. తను మాత్రం గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించేందుకు భారీ సన్నాహాలు చేస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ కూడా తన తుదితీర్పు 14 వ చాప్టర్‌లో ఏ రాష్ట్రంలో గాని తాను కేటాయింపులు చేసిన జలాలు వినియోగంలో వుంటే తిరిగి పంపిణీ చేయ కూడదనే నిబంధన విధించి రక్షణ కల్పించింది. ఫలితంగానే 2004 లో నియమించిన ఇదే బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్-2 బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు జోలికి వెళ్లకుండా నికర జలాలు 163టీఎంసీలు మిగులు జలాలు 285 టీఎంసీలు మొత్తం 448 టీఎంసీలు బేసిన్‌లోని రాష్ట్రాల మధ్య పంచింది. ఒకప్పుడు బచావత్ ట్రిబ్యునల్ అమలుచేసిన నిబంధనలనే పాటించిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నేడు మాత్రం లక్ష్మణరేఖ ఏలా అతిక్రమించ గలదు?

**విశ్రాంత పాత్రికేయులు**
**సెల్: 9848394013**

# రైతు ఉద్యమ మార్గదర్శి

**ఆర్వీ రామారావ్**

రైతు ఉద్యమానికి శ్రీకారం చుట్టినవారిలో మొట్ట మొదట చెప్పుకోవలసింది స్వామీ సహజానంద సరస్వతి గురించే. అంత మాత్రం చేత మన దేశంలో అంతకు ముందు రైతు ఉద్యమాల ఆనవాళ్లు లేవని కాదు. ఆయనంత దీక్షగా రైతుల గురించి ఆలోచించినవారు మాత్రం తక్కువే. స్వామీ సహజానంద సరస్వతి (22 ఫిబ్రవరి 1889-26 జూన్ 1950) అసలు పేరు నవరంగ్ రాయ్. ఆయన పుట్టింది ఉత్తరప్రదేశ్ లోనైనా ఆయన ప్రధాన కార్య క్షేత్రం మాత్రం బీహార్. ఆయన మేటి జాతీయవాది, మేధావి, సంఘ సంస్కర్త, బహు గ్రంథ రచయిత. ఆయన స్వామి వేషధారి కావచ్చు కానీ చిత్తశుద్ధిగల కార్య సాధకుడు. చిన్న రైతులకు, వ్యవసాయ కార్మికులకు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆయన తపించారు. 1936లో అఖిలభారత కిసాన్ సభ ఏర్పడడానికి ఏడేళ్ల ముందే స్వామీ సహజానంద బీహార్‌లో రైతుల ఉద్యమం నడిపారు. 1930, 1940లో ఆయన బీహార్‌లో "బకాష్ట్" ఉద్యమం నడిపారు. ఇది కౌలుదార్లను తొలగించడాన్ని ప్రతిఘటించే ఉద్యమం. అంటే కౌలుదార్ల రక్షణకు ఉద్దేశించింది. సహజానంద నడిపిన ఈ ఉద్యమం ప్రభావంవల్లే కౌలుదార్ల రక్షణ చట్టం వచ్చింది. బీహార్‌లో దాల్మియా చక్కెర ఫ్యాక్టరీకి వ్యతిరే కంగా ఆయన విజయవంత మైన ఉద్యమానికి నాయకత్వం వహిం చారు. స్వామి సహజానందకు కొంత కాలం కమ్యూనిస్టు పార్టీతో సన్నిహిత సంబంధం ఉండేది. ఆ తరవాత కొంత కాలం సుభాష్ చంద్రబోస్ ఏర్పాటు చేసిన ఫార్వర్డ్ బ్లాక్‌కు సన్నిహితంగా ఉన్నారు. సహజానంద కేవలం రైతు నాయకుడే కాదు. ఆయన కాలం నాటి యువతరానికి గొప్ప స్ఫూర్తి ప్రదాత. సహజానంద మీద గౌరవానికి సూచనగా ఆయన 112వ జన్మదినం సందర్భంగా 2001లో రెండు రోజులపాటు కిసాన్ మహాపంచాయత్




నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆయన పేర శాస్త్రవేత్తలకు, వ్యవసాయ రంగంలో పని చేసే వారికి అవార్డులు ఇస్తుంది. ఉత్తరప్రదేశ్ లో ఆయన స్మృత్యర్థం గాజీపూర్‌లో స్నాతకోత్తర కళాశాల ఏర్పాటు చేశారు. కొంత కాలం సంఘసేవలోనే నిమగ్నమైనా కొద్ది కాలానికే జాతీయోద్యమంలోకి దూకారు. అనేక ఏళ్లు జైలులో గడపాల్సి వచ్చింది. ఆయన తన ఆత్మ కథ రాసుకున్నా ఆయన మీద ఇతరులు కూడా ఆయన జీవిత చరిత్రలు రాశారు.

# సహనశీలి మన్మోహన్: అమర్త్యసేన్

**న్యూదిల్లీ:** మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌ను 'మంచి రాజకీయ నాయకుడు', 'అద్భుతమైన ఆర్థిక వేత్త' అని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అభివర్ణించారు. సహనం, ఐక్యతతో కూడిన ప్రపంచానికి చెందిన అవసరాన్ని ఆయన అర్థం చేసుకున్నారని అన్నారు. కేంబ్రిడ్జ్‌లో ఉన్నప్పటి నుంచి దాదాపు ఏడు దశాబ్దాలుగా సింగ్‌కు సన్నిహిత మిత్రుడిగా ఉన్న ఈ ప్రముఖ మేధావి పశ్చిమ బెంగాల్‌లోని బిర్భూమ్ జిల్లాలోని తన పూర్వీకుల నివాసంలో పీటీఐతో మాట్లాడుతూ మానవులు విభిన్న విశ్వాసాల ఉనికిని గుర్తించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పే వజ్రచ్ఛేదిక ప్రజ్ఞాపరమిత సూత్రంలో గౌతమ బుద్ధుని సందేశ సారాంశాన్ని గ్రహించగల సామర్థ్యం కలిగిన మన్మోహన్‌ను ప్రశంసించారు. 'భారత గడ్డపై పాకిస్తాన్ ఉగ్రవాదం ఉన్నట్లు ఆధారాలు ఉన్నప్పుడు తీవ్రంగా స్పందించకూడదని ఆయనకు తెలుసు. మానవులు విభిన్న విశ్వాసాల ఉనికిని గుర్తించడం ముఖ్యం అనే 'వజ్రచ్ఛేదిక ప్రజ్ఞాపరమిత సూత్రం' లేదా వజ్రసూత్రంలో గౌతమ బుద్ధుడు ఇచ్చిన సందేశాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. మీరు ఒక నిర్దిష్ట విశ్వాసాన్ని ఇష్టపడవచ్చు, కానీ అది ఇతరులను కించపరిచేలా చేయకూడదు' అని ఆర్థిక వేత్త వివరించారు. 'వజ్రచ్ఛేదిక ప్రజ్ఞాపరమిత సూత్రం లేదా 'వజ్రసూత్రం' అనేది ప్రజ్ఞాపరమిత ('జ్ఞానం యొక్క పరిపూర్ణత') సూత్రాల శైలికి చెందిన మహాయాన (బౌద్ధమతంలోని రెండు ప్రాథమిక శాఖలలో ఒకటి) బౌద్ధ గ్రంథం. తూర్పు ఆసియాలో అత్యంత ప్రభావవంతమైన మహాయాన సూత్రాలలో ఒకటైన వజ్రసూత్రం చాన్ (లేదా జెన్) సంప్రదాయంలో ముఖ్యంగా ప్రముఖమైనది. ఈ సూత్రంలో గౌతమ బుద్ధుడు ఒక సీనియర్ సన్యాసి సుభూతికి చేసిన ప్రసంగం ఉంది. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు సహచరుడు అయిన అమర్త్యసేన్... సింగ్‌తో తాను చేసిన సుదీర్ఘ ప్రసంగాలను గుర్తు చేసుకుంటూ, 'ఇతర విశ్వాసాలు, వర్గాల ప్రజల పట్ల'' బుద్ధుని సందేశాన్ని నిర్మించినందుకు ఆయనను ప్రశంసించారు. 'వజ్ర సూత్రంలో గౌతమ బుద్ధుని సందేశాన్ని మన్మోహన్ బాగా తెలుసుకున్నారని నేను అనుకుంటున్నాను. మేము విద్యార్థులుగా కలిసి ఉన్నప్పుడు, తరువాత స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నప్పుడు కూడా నేను ఆయనతో సుదీర్ఘ సంభాషణలు జరిపాను. మన్మోహన్ సిక్కు అయినప్పటికీ, ఆ గుర్తింపు అతనికి ముఖ్యమైనది అయినప్పటికీ, ఆయన ఇతర విశ్వాసాలు, వర్గాల ప్రజల పట్ల గౌతమ బుద్ధుని సందేశాన్ని నిర్మించాడు. 'నేను మన్మోహన్‌ను చాలా ఇష్టపడ్డాను. ఆయన స్నేహితుడు అయినందున మాత్రమే కాదు' అని ఆర్థిక వేత్త ముగించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో 5 రోజుల్లో 200 సర్జరీలు

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు రోజుల వ్యవధిలోనే రెండు వందల శస్త్రచికిత్సలు చేయడంతో అరుదైన రికార్డును నమోదు చేసుకుంది. నగరంలోని అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం ఐదు రోజుల్లో ఏకంగా 200కిపైగా శస్త్రచికిత్సలు చేసినట్టు ఆసుపత్రి అధికారులు తెలిపారు. డైరెక్టర్ మణిమోయ్ బెనర్జీ, డాక్టర్ అభిమన్యు బసు, డాక్టర్ దీప్తేంద్ర సర్కార్ సహా 30 మందికిపైగా వైద్యుల బృందం ప్రతి రోజూ 35 నుంచి 40 ఆపరేషన్లు చేసినట్లు వివరించారు. ఈ 200 సర్జరీలూ విజయవంతంగా నిర్వహించినట్టు పేర్కొన్నారు. దీంతో రోగుల బంధువుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని.. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి మరింత మెరుగుపడుతుందని పలువురు ఆశిస్తున్నారు. టాటా మెమోరియల్ హాస్పిటల్‌తో కలిసి క్యాన్సర్ కేర్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## డ్రగ్స్‌కు బానిసై తల్లిని కడతేర్చిన కసాయి

**న్యూదిల్లీ:** డ్రగ్స్‌కు బానిసైన ఓ పుత్రుడు డబ్బుల కోసం కన్న తల్లినే కడతేర్చిన హృదయవిదారక సంఘటన దేశ రాజధాని దిల్లీలో జరిగింది. వివరాల్లోకి వెళితే... దయాల్‌పూర్ ప్రాంతంలో నివసించే సోను (40) కొంతకాలం డ్రైవర్‌గా పని చేశాడు. డ్రగ్స్‌కు బానిస అయిన అతడు ప్రస్తుతం పనీపాట లేకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. డ్రగ్స్ కొనేందుకు డబ్బుల కోసం తల్లి (60)ని రోజూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ రాత్రి తల్లితో సోను వాగ్వాదానికి దిగాడు. తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నిరాకరించిన తల్లిని హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. తల్లిని హత్య చేసిన సోనూను అరెస్ట్ చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రగ్స్‌కు బానిస అయిన సోను డబ్బుల కోసం తల్లితో తరుచుగా గొడవపడేవాడని పోలీస్ అధికారి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## విజయ్ భద్రతపై రాజకీయ దుమారం

**చెన్నై:** అగ్రనటుడు, టీవైకే పార్టీ అధినేత విజయ్‌కు కేంద్రం 'వై' కేటగిరీ భద్రత కేటాయించడం రాజకీయ దుమారం రేపుతోంది. విజయ్‌తో పాటు కొంతమంది ప్రముఖుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు తాజాగా కేంద్ర హోం శాఖకు ఇచ్చిన నివేదికల మేరకు వాళ్లందరికీ 'ఎక్స్, వై, జెడ్' కేటగిరీల కింద ప్రత్యేక భద్రత కల్పించేందుకు కేంద్ర హోంశాఖ ముందుకు వచ్చింది. ఈ నిర్ణయంతో ఒకరు లేదా ఇద్దరు కమాండోలతో పాటు 8 నుంచి 11 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది విజయ్‌కు భద్రతగా ఉండనున్నారు. అయితే... ఈ వ్యవహారం తమిళనాట రాజకీయ విమర్శలకు దారి తీసింది. విజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వమే ఇలాంటి భద్రత ఎందుకు కల్పించలేకపోయిందని బీజేపీ ప్రశ్నలు సంధించింది. 'విజయ్ తమిళనాట ప్రజాదరణ ఉన్న వ్యక్తి. అలాంటి వ్యక్తి భద్రతకు ముప్పు పొంచి ఉందనే సమాచారం ఉన్నప్పుడు... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. డీఎంకే ప్రభుత్వం ఆయనకు భద్రత కల్పించేందుకు ముందుకు రావొచ్చు కదా?' అని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నించారు. మరోవైపు... వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో విజయ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి బీజేపీ ఆడుతున్న డ్రామా ఇదని అన్నాడీఎంకే ఆరోపిస్తోంది. 'నిజాయితీగా విజయ్‌కు కేంద్రం భద్రతను ఇచ్చి ఉంటే ఫర్వాలేదు. కానీ, రాజకీయం కోసం చేసి ఉంటే మాత్రం... తమిళనాడులో అలాంటి పాచికలు పారవు' అని అన్నాడీఎంకే నేత మునుస్వామి చురకలటించారు. విజయ్ గత ఏడాది ఫిబ్రవరిలో తమిళగ వెట్రి కజగం అనే పార్టీని ప్రకటించారు. రాష్ట్రంలో డీఎంకే, కేంద్రంలోని బీజేపీకి తన పార్టీ ప్రత్యామ్నాయమని ప్రకటించారు. ఆ మధ్య ఓ బహిరంగ సభకు అశేషమైన స్పందన లభించింది. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తోనూ ఆయన తరచూ భేటీ అవుతూ వస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికలనే లక్ష్యంగా ఆయన టీవీకేను ముందుకు తీసుకెళ్తున్నారు.

## మోదీ, షా వైఫల్యానికి ప్రతీక

### మణిపూర్‌లో రాష్ట్రపతిపాలనపై గొగోయ్

**న్యూదిల్లీ:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఈశాన్య ప్రాంతంలో బీజేపీ నాయకత్వం 'సమష్టి వైఫల్యానికి ప్రతీక' అని కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ శనివారం అభివర్ణించారు. గురువారం ఘర్షణలతో నిండిన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత రాష్ట్ర అసెంబ్లీని సస్పెండ్ చేశారు. మణిపూర్‌లో స్థిరమైన శాంతి, సయోధ్య కోసం ఇంకా కార్యాచరణ లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు కూడా అయిన గొగోయ్ అన్నారు.

'అందువల్ల బీజేపీ రాష్ట్ర విభాగం పూర్తిగా గందరగోళంలో ఉన్నందున మాత్రమే రాష్ట్రపతి పాలన ఉందని చెప్పవచ్చు. మణిపూర్, భారతదేశ ప్రజలు దీనికి అర్హులు' అని ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. మే 2023లో ప్రారంభమైన జాతి హింసలో ఇంఫాల్ లోయలోని మెజారిటీ మైతేయి వర్గానికి, చుట్టుపక్కల కొండలలోని కుకి-జో గిరిజన సమూహాలకు మధ్య దారుణమైన ఘర్షణలు జరిగాయి. దీని ఫలితంగా 250 మందికి పైగా మరణించడంతో పాటు వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## పంజాబ్ ప్రతిష్ఠ దిగజార్చడానికే...

- కేంద్రంపై సీఎం మాన్ విమర్శ
- రాజకీయ లబ్ధికే విమర్శలన్న బీజేపీ

**న్యూదిల్లీ:** అక్రమ వలసదారుల తరలింపు నేపథ్యంలో అమెరికా నుంచి వస్తున్న విమానాలు అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగుతుండడంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజాబ్ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆ విమానాలు అమృత్‌సర్‌కు తీసుకొస్తున్నదని మండిపడ్డారు. 'అక్రమ వలసదారులతో ఇప్పుడు రెండో విమానం వస్తోంది. ఇది కూడా అమృత్‌సర్ విమానాశ్రయంలోనే దిగనుంది. అమృత్‌సర్‌నే ఎందుకు ఎంపిక చేసుకుంటున్నారు. దిల్లీలో ఎందుకు దించడం లేదు. పంజాబీలు మాత్రమే అక్రమంగా వలస వెళతారని ప్రచారం చేయడానికా?ఈ విషయంపై విదేశాంగ శాఖ సమాధానం చెప్పాలి' అని భగవంత్ మాన్ కేంద్రంపై మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగంగానే అక్రమ వలసదారులను తీసుకొస్తున్న రెండో విమానాన్ని కూడా ఇక్కడే దించుతుందని ఆరోపించారు. కాగా, సీఎం మాన్ ఆరోపణలను బీజేపీ ఖండించింది. అమెరికా నుంచి వచ్చే విమానాలకు అమృత్‌సర్ దగ్గర కాబట్టే ఆ విమానాశ్రయాన్ని ఎంచుకున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ చెప్పుకొచ్చారు. ఇటువంటి సున్నితమైన విషయాలను రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకోవడం సరైన చర్య కాదని అన్నారు. భగవంత్ మాన్ ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని, ముఖ్యమంత్రి తన స్థాయికి తగ్గట్టుగా నడుచుకోవాలని మండిపడ్డారు. ఈ విషయంపై అవగాహన లేని పంజాబ్ సీఎం కుట్ర సిద్ధాంతాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు దేశ భద్రత గురించి పట్టించుకోరని, రాజకీయాలు చేయడానికి ఎక్కడ అవకాశం దొరుకుతుందా అని ఎదురుచూస్తుంటారని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ విమర్శించారు.

**భారత దౌత్యానికి పరీక్ష: చిదంబరం**

అమెరికా నుంచి భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి తీసుకురావడంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం స్పందించారు. మోదీ సర్కారుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది భారత దౌత్యానికి ఓ పరీక్ష లాంటిదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

అక్రమ వలసదారులు విమానం అమృత్‌సర్ రాకపై అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని చిదంబరం పేర్కొన్నారు. అక్కడినుంచి బహిష్కరణకు గురైనవారి చేతులకు సంకెళ్లు, కాళ్లకు తాళ్లు కట్టి ఉంటాయా అనే సందేహాలు వస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇది భారత దౌత్యానికి పరీక్షగా మారిందన్నారు. విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ బహిష్కరణలను సరిగా నిర్వహించడం లేదని ఆరోపించారు.

## మాటలే... చర్యలు శూన్యం

### ఏఐపై మోదీ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్

**న్యూదిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ కృత్రిమమేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశానికి మంచి నైపుణ్యత ఉందని, ఉత్పత్తికి సంబంధించి పటిష్ట పునాది అవసరమని, ఒట్టి మాటలు కాదని పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీని వివరిస్తూ ఎక్స్ వేదికగా శనివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. కొత్త సాంకేతికతను రూపొందించడానికి మనకు బలమైన పునాది కావాలని ఆయన సూచించారు. 'డ్రోన్‌లు యుద్ధరంగంలో విప్లవాత్మక మార్పులు చేశాయి. బ్యాటరీలు, మోటార్లు, ఆప్టికల్‌లు జత చేయడంతో యుద్ధభూమిలో కమ్యూనికేట్ అవుతున్నాయి. అయితే, ఇది కేవలం ఒక సాంకేతికత కాదు. బలమైన పారిశ్రామిక వ్యవస్థతో ఉత్పత్తి చేసిన ఆవిష్కరణలు. దురదృష్టవశాత్తూ ప్రధాని మోదీ ఈ విషయాన్ని గ్రహించడంలో విఫలమయ్యారు. ఆయన ఏఐపై టెలీప్రాంప్టర్‌లో ప్రసంగాలు చేసుకుంటూ ఉంటే... మన పోటీ దేశాలు మాత్రం కొత్త సాంకేతికతను సృష్టించి రాటుదేలుతున్నాయి. సాంకేతికతను రూపొందించడానికి మనకు ఒక బలమైన పునాది కావాలి. వట్టి మాటలు కాదు' అని రాహుల్ విమర్శించారు. డ్రోన్ ఉత్పత్తిలో చైనా పురోగతిని ఉదాహరణగా చూపుతూ... భారత్‌కు స్పష్టమైన వ్యూహం అవసరమని రాహుల్ స్పష్టంచేశారు. మన దేశంలో అపారమైన ప్రతిభ కలిగిన ఇంజినీరింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు దేశాన్ని ముందుకు నడిపేందుకు ధృఢమైన పారిశ్రామిక నైపుణ్యం అవసరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన మోదీ... ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు అధ్యక్షుడు మెక్రాన్‌తో కలిసి అధ్యక్షత వహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనలను కొట్టిపారేశారు. టెక్నాలజీ వల్ల పని అదృశ్యం కాదని, అది తన రూపాన్ని మార్చుకుంటుందని, కొత్తతరహా ఉద్యోగాలు పుట్టుకొస్తాయని చరిత్ర చెబుతోందన్నారు.

## బీజేపీ గూటికి ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు

**న్యూదిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు శనివారం బీజేపీలో చేరారు. దీంతో రాబోయే ఎంసీడీ మేయర్ ఎన్నికల్లో కాషాయ పార్టీ విజయావకాశాలను పెంచారు. బీజేపీ నగర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా కౌన్సిలర్ల చేరికను స్వాగతిస్తూ... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు 'వికసిత భారత్' కార్యక్రమం క్రింద రాజధానిగా అభివృద్ధి చేయడానికి సరైన సమయంలో కేంద్రంలో, అసెంబ్లీ, మునిసిపల్ స్థాయిలో దిల్లీకి 'ట్రిపుల్ ఇంజిన్' ప్రభుత్వం ఉంటుందన్నారు. ముగ్గురు కౌన్సిలర్లు అనితా బసోయా (ఆండ్రూస్ గంజ్), నిఖిల్ చప్రానా (హరి నగర్), ధరమ్‌వీర్ (ఆర్ కె పురం) ఉన్నారు. దిల్లీని పరిశుభ్రమైన, అందమైన నగరంగా మార్చడానికి కౌన్సిలర్లు బీజేపీలో చేరారని సచ్‌దేవా చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్దం తర్వాత ఆప్‌ను అధికారం నుంచి తొలగించి బీజేపీ 70 అసెంబ్లీ స్థానాలకుగాను 48 స్థానాలను గెలుచుకుంది. మేయర్ ఎన్నిక ఏప్రిల్‌లో జరగనుంది. నవంబరు 2024లో జరిగిన చివరి మేయర్ ఎన్నికల్లో ఆప్ మూడు ఓట్ల తేడాతో విజయం సాధించింది. కాగా, కౌన్సిలర్లతో పాటు ఏడుగురు లోక్‌సభ ఎంపీలు (అందరూ బీజేపీకి చెందినవారు), ముగ్గురు రాజ్యసభ ఎంపీలు (అందరూ ఆప్‌కు చెందినవారు), దిల్లీలోని 14 మంది నామినేటెడ్ ఎమ్మెల్యేలు దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలలో ఓటర్లుగా ఉన్నారు. ముగ్గురు కౌన్సిలర్ల చేరికతో బీజేపీ సంఖ్య ఇప్పుడు ఆప్ కంటే ఎక్కువగా ఉంది. బీజేపీ తన ఎమ్మెల్యేలలో 10 మందిని ఎంసీడీకి నామినేట్ చేయనుంది. ఆప్ పౌర సంస్థకు నాలుగు నామినేషన్లు కలిగి ఉంటుందని బీజేపీ నాయకులు తెలిపారు. ఫిబ్రవరి 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ కౌన్సిలర్లు, ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2022 ఎంసీడీ ఎన్నికలలో ఆప్ 134 వార్డులను, బీజేపీ 104, కాంగ్రెస్ తొమ్మిది, స్వతంత్రులు మూడు వార్డులను గెలుచుకున్నారు.

## కుంభమేళా వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం

### 10 మంది దుర్మరణం



**ప్రయాగ్‌రాజ్:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పది మంది భక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో 19 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా చత్తీస్‌గఢ్‌కు చెందినవారిగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన భక్తులను సమీప ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ విషాదకరమైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది.

ప్రయాగ్‌రాజ్ నుంచి మీర్జాపూర్ వెళ్లే జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో భక్తులతో నిండిన బొలెరో వాహనం, వేగంగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బొలెరోలో ప్రయాణిస్తున్న 10 మంది భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారు చత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాకు చెందినవారు. ఈ భక్తులు సంగమ స్నానం కోసం మహా కుంభమేళా వెళు తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న 19 మంది భక్తులు కూడా గాయపడ్డారు. ఈ భక్తులు మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాకు చెందినవారు. వారణాసి వెళ్లడానికి సిద్ధమయ్యారు. గాయపడిన వారిని రామ్‌నగర్‌లోని సీహెచ్‌సీలో చేర్చారు. సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం బస్సు పక్కకు వెళ్తుండగా బొలెరో వాహనం అతి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టిందని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో చాలామంది నిద్రపోతున్నారని, అకస్మాత్తుగా జరిగిన ప్రమాదం తమకు భయంకరమైన అనుభవాన్ని ఇచ్చిందని బస్సులో ప్రయాణిస్తున్న రాధ్మల్ అనే భక్తుడు తెలిపారు.

ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ... వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## గొప్పగా పెళ్లి చేయాలనుకుంటాం

### కుమారుడి పెళ్లి ఖర్చు విమర్శలపై నీతా అంబానీ

**ముంబై:** అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ వివాహం గత ఏడాది అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కొన్ని రోజులపాటు జరిగిన ఆ పెండ్లి కోసం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారంటూ విమర్శలు వచ్చాయి. తాజాగా బ్లూమ్ బర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విమర్శలపై నీతా అంబానీ స్పందించారు. ఇంటర్వ్యూలో భాగంగా అనంత్ పెళ్లిని ఆడంబరంగా నిర్వహించారనే విమర్శలు మీకు ఇబ్బందిగా అనిపించాయా? అని యాంకర్ ప్రశ్నించారు. దీనికి నీతా అంబానీ సమాధానం ఇచ్చారు. 'పిల్లల పెళ్లి విషయంలో తల్లిదండ్రులు బెస్ట్ ఇవ్వాలని అనుకుంటారు. మేము కూడా అదే చేశాం. అనంత్ పెళ్లి మేడ్ ఇన్ ఇండియా బ్రాండ్ అని భావిస్తున్నా. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురాగలిగాం. ఈ విషయంలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం' అని చెప్పారు. ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ కొన్నాళ్లు ప్రేమించుకున్నారు. జులై 2024లో వివాహం చేసుకున్నారు. వీరి వివాహం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రెండు సార్లు ప్రీవెడ్డింగ్ వేడుకలు జరిగాయి. ఆ తర్వాత సంగీత్, మెహందీ, హల్దీ వేడుకలతో పాటు వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. దీనికి ముంబైలోని జియో వరల్డ్ సెంటర్ వేదికైంది. వీరి వివాహానికి దేశ విదేశాలకు చెందిన సినీ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు హాజరయ్యారు. దీనిపై అప్పట్లోనే విమర్శలు రాగా అంబానీ దంపతులు స్పందించలేదు. తాజా ఇంటర్వ్యూలో తలెత్తిన ప్రశ్నకు నీతా జవాబుచ్చారు.

## కుంభమేళా గడువు పొడిగించండి: అఖిలేశ్

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగున్న కుంభమేళాకు కోట్లాది భక్తులు పోటెత్తుతున్నారు. అక్కడికి వెళ్లే రైళ్లతోపాటు రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో కొందరు భక్తులు కుంభమేళాకు వెళ్లలేకపోవడంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు. కుంభమేళా గడువు పొడిగించాలని యూపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'ఇప్పుడు చాలా మంది కుంభమేళాకు వెళ్లాలని కోరుకుంటున్నారు. కానీ వెళ్లలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో కుంభమేళా సమయ పరిమితిని ప్రభుత్వం పొడిగించాలి' అని అన్నారు. గతంలో మహా కుంభ్, కుంభమేళా 75 రోజులు కొనసాగినట్లు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న కుంభమేళా గడువు తక్కువగా ఉందని చెప్పారు. గత నెలలో కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్యను ప్రభుత్వం దాచిందని ఆయన ఆరోపించారు. మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభమైంది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రితో ముగుస్తుంది. దీంతో ముగింపు గడువు సమీపిస్తుండటంతో కుంభమేళాకు దారితీసే రహదారుల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. అధిక జన సమూహం కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వే స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేశారు.

## రుణ షరతులు 'అన్యాయం'

**కేంద్రంపై ఎల్డీఎఫ్, యూడీఎఫ్ విమర్శలు**



**తిరువనంతపురం/త్రిస్సూర్:** వయనాడ్ పునరావాసం కోసం కేంద్రం రూ.529.50 కోట్ల షరతులతో కూడిన రుణం మంజూరు చేయడం కేరళలో రాజకీయ దుమారాన్ని రేపింది. అధికార వామపక్షాలు, ప్రతిపక్ష యూడీఎఫ్ ఈ నిబంధనలను విమర్శించగా, ఇచ్చిన మొత్తం 'నిజానికి గ్రాంట్' అని బీజేపీ పేర్కొంది. వయనాడ్ పునరావాసం కోసం కేంద్రం మంజూరు చేసిన రూ.529.50 కోట్ల రుణం 'భయంకరమైన', 'క్రూరమైన హాస్యం' పరిస్థితులను కలిగి ఉందని కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ శనివారం మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీశన్, ఒక రోజు క్రితం, ముఖ్యంగా మార్చి 31 నాటికి మొత్తం మొత్తాన్ని ఉపయోగించాలనే షరతును 'ఆచరణ సాధ్యం కాదు' అని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సురేంద్రన్ మాట్లాడుతూ ఇది 50 సంవత్సరాల వడ్డీ లేని రుణమని, 'ఇది వాస్తవానికి గ్రాంట్' అని చెప్పారు. మంత్రి రాజన్ మాట్లాడుతూ రుణానికి సంబంధించిన షరతులు వయనాడ్, కేరళలోని కొండచరియలు విరిగిపడిన బాధితుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని సూచిస్తున్నాయని అన్నారు. త్రిసూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కేరళకు సరిగ్గా రావాల్సిన షరతులు లేని ఆర్థిక సహాయం అందించడానికి బదులుగా, కేంద్రం మార్చి 31 నాటికి మొత్తం మొత్తాన్ని వినియోగించుకోవడంతో సహా కఠినమైన షరతులతో రుణం ఇచ్చిందని ఆయన తెలిపారు. కాగా, శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ మాట్లాడుతూ మార్చి 31 నాటికి ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవాలనే నిబంధనను 'భారీ ఆచరణాత్మక సమస్య' గా అభివర్ణించారు. వయనాడ్‌లో విపత్తు ప్రభావిత ప్రాంతాల పునరావాసానికి ఆర్థిక సహాయం మంజూరు చేయకపోవడంపై కేరళలోని అధికార ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కేంద్రంపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ రుణం మంజూరయింది. గత ఏడాది జులైలో వయనాడ్ జిల్లాలోని మూడు గ్రామాల్లో కొండ చరియలు విరిగి పడిన ఘటనల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

## విద్య లాభాపేక్షతో నడుస్తోంది

### కేంద్రం కోచింగ్ సెంటర్లను నియంత్రించాలి: కన్హయ కుమార్

**న్యూదిల్లీ :** భారతదేశంలో ప్రబలంగా ఉన్న 'లాభాపేక్షతో నడిచే కోచింగ్ విద్యా వ్యవస్థ' గురించి కాంగ్రెస్ నాయకుడు కన్హయ కుమార్ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల ఆత్మహత్య రేటు పెరగడానికి దారితీసిందని, ఇది దేశంలో రైతు ఆత్మహత్య రేటు కంటే ఎక్కువగా ఉందని తెలిపారు. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) జాతీయ ఇంఛార్జ్ కూడా అయిన కుమార్ ఒక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో విద్యను ఇప్పుడు లాభాపేక్షతో చూస్తున్నారని అన్నారు. 'ప్రభుత్వం దేశంలోని సంస్థల ప్రమాణాలను తగ్గిస్తోంది. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు సహాయం చేయడానికి ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతుంది. వారు ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును దోచుకుని, విద్యార్థుల భవిష్యత్ గురించి పట్టించుకోకుండా పారిపోతారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఈ వ్యవస్థ 'లాభాపేక్షతో నడిచేది' గా మారినందున నేర్చుకోవడానికి బదులుగా ప్రదర్శన ఇవ్వాలనే ఒత్తిడి విద్యార్థులపై పెరుగుతుందన్నారు. 'సంస్థలలో ఎన్ని సీట్లు ఉన్నాయి? పరీక్షలలో పారదర్శకత గురించి కూడా ఒక ప్రశ్న ఉంది. ఈ పరీక్షలు ఎంత న్యాయమైనవి, ఉచితం?' అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్ల నియంత్రణకు నిబంధనలను అమలు చేయాలని కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోరఖ్‌పూర్‌కు చెందిన ఒక బాలిక ఆత్మహత్యను ప్రస్తావిస్తూ, భారతదేశంలో ప్రతి గంటకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడని తెలిపారు. దేశంలో నిరుద్యోగం గత 35 సంవత్సరాలలో అత్యధిక స్థాయిలో ఉందన్నారు. 'ఉద్యోగాలు లేవు. ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు?' అని కన్హయ కుమార్ ప్రశ్నించారు.

# విశాలాంధ్ర హైదరాబాద్

## అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర – హైదరాబాద్ : నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకెళ్తోందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో శనివారం రూ.42.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. రూ.22.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీవరేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, హైదరాబాద్ నగరాన్ని సుందరంగా, స్వచ్ఛ, పచ్చ నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ, రోడ్డు, తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా సి.సి రోడ్లు, సీవరేజీ లైన్ అభివృద్ధి పనులు తమ కాలనీలో చేపట్టడం పట్ల ప్రేమ్‌నగర్ వాసులు మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివకుమార్, సంబంధిత శాఖల అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మబిక్షం జయంతి వేడుకలు

విశాలాంధ్ర – ఎల్.బి.నగర్ : బొమ్మగాని ధర్మబిక్షం జయంతి వేడుకలను న్యూ నాగోల్‌లోని సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం, ఎస్.ఏ.డాంగే భవన్‌లో శనివారం కందుల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ప్రజల మనిషి, స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మ బిక్షం 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీ.సీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి, సిపిఐ మేడ్చల్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ హాజరయ్యారు. ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, మమత, సుశీల, సౌజన్య, యు.మల్లేష్, జై.శివ, బిక్ష నాయక్, ఎం.లౌకియా, డి.జైపాల్, కే.శంకర్ నాయక్, విసరి లాల్, సోమాలియా బిచ్చాలి, చేతి వృత్తి సంఘాలు, మహిళా సమాఖ్య, యువజన విద్యార్థి, గిరిజన సమాఖ్య, ఏఐటియుసి తదితర ప్రజాసంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్లకై ఏడిఈకి వినతి

విశాలాంధ్ర – మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్ మసీదుకు మూడు కరెంట్ మీటర్లు కావాలని కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏడిఈ చంద్రశేఖర్‌ని కలిసి మజీద్ కమిటీ సభ్యులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం మజీద్ ముందున్న పెండింగ్‌లో ఉన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ ప్రేంకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు, కిషోర్, మజీద్ కమిటీ సభ్యులు వాజిద్ అలీ, రఫిక్. అజ్మత్, లక్మల్, జహీరుద్దీన్, మహబూబ్, ఖబీర్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన సమీనా బేగంకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2.50 లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని తెలిపారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేనీ చంద్రకాంత్‌రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీ.ఇబ్రహీం, పురెందర్ రెడ్డి, శ్రీమన్నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

**ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి**

**హౌజింగ్, రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్ అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేనటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హౌజింగ్ అధికారులకు సూచించారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవిన్యూ, హౌసింగ్, ఐ అండ్ పిఆర్ ఉన్నత అధికారులతో 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సమీక్షించారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి ఈ ఏడు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్ నగర్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. జిపి, ఏజీపీలతో ప్రభుత్వ భూవివాద కేసులకు సంబంధించి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వానికి దక్కే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సినిమా కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘు చిత్రాలను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఆలోచనలను, ప్రభుత్వ పథకాలను లఘు చిత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడానికి కావలసిన చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర రాజధాని హైదరబాద్ మహానగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆవుటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం శాట్ లైట్ టౌన్ షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ మహానగరంలో మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి ఇండ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, కావాల్సిన భూమి కొరకు రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించి భూమిని సేకరించుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు ఎస్ఆర్ నగర్, బర్కత్‌పుర, కూకట్‌పల్లి, ఈసిఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి పేరిట ఇండ్ల నిర్మాణాలు చేయడం వల్ల ఎంతో మంది మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల నెరవేరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డిజిటల్ భూ సర్వేకు సంబంధించి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కాలుష్యం లేనటువంటి గ్రీన్ ఎనర్జీని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రెవిన్యూ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ ఎండి గౌతమ్. ఐ అండ్ పిఆర్ కమిషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదల, క్రమశిక్షణే విజయానికి కారణం

**జిల్లా కలెక్టర్ గౌతం**

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు బోధించారు. శనివారం కీసర మండలంలోని బోగారంలో గల మేడ్చల్, ఖైరతాబాదు, అంబర్‌పేట్‌లకు కలిపి నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు సూచించారు. పదవత తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్‌కు సూచించారు. అవసరమైన మరమ్మత్తులు చేయించేందుకు అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో కొంచెం కొంచెంగా మినహాయించి మరమ్మత్తులు చేయించాలని నిర్వాహకులకు తెలిపారు. స్కూలులోని వంట శాలను, స్టోరురూంను కలియ తిరిగి పరిశీలించారు. స్టోరురూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి లేకుండా సామాగ్రిని నిలువ ఉంచాలని కలెక్టరు స్టోర్ ఇంఛార్జిని ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. శనివారం మెనులో ఏమి వండారని వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, ఇంటర్‌లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఫేజ్ జెఈఈలో 89 శాతం సాధించిన కె.తరుణ్‌ను కలెక్టరు అభినందించారు. తరుణ్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను, అవసరమైన చేయూతనందించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట ఉపేందర్ రెడ్డి, కీసర తహసీల్దారు అశోక్, ఇంఛార్జి ప్రిన్సిపల్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

## మూసిలో గుర్రపు డెక్క తొలగింపు

విశాలాంధ్ర – హైదరాబాద్ : మూసి నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి, దోమల లార్వాను నియంత్రించడానికి ఎంఐఓ ఆయిల్, టెమెఫోస్ వంటి లార్విసైడ్‌లను పిచికారీ చేయడానికి సుమారు 25 నాప్‌సాక్ స్ప్రేయర్లు, 5 పవర్ స్ప్రేయర్‌లను ఉపయోగించారు. దోమల లార్వాలను నియంత్రించడానికి మూసీ నదిలోని గుర్రపు డెక్కను తొలగించడానికి ఎంటమాలజీ విభాగం గత పది రోజులుగా పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ యాంటీ లార్వా ఆపరేషన్లు బస్తీలు, కాలనీలు, చారిత్రక భవనాలు (ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు, సిటీ కాలేజ్, సాలార్జంగ్ మ్యూజియం)తో పాటు మూసీ బెల్ట్ చుట్టూ ఉన్న గోషామహల్, కార్వాన్ సర్కిల్‌లలోని 5 నుండి 6 డివిజన్లలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆటోల నిరవధిక బంద్

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిరాకపోతే రాష్ట్ర వ్యాప్త నిరవధిక ఆటో బంద్ చేపడుతామని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ హెచ్చరించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ హైదరాబాద్, హిమాయత్ నగర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుండి నారాయణగూడ చౌరస్తా వరకు శనివారం వందలాది మంది ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ నిర్వహించింది. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి. వెంకటేశం (ఏఐటీయూసీ), ఏ.సత్తిరెడ్డి (టిఏడిఎస్) పి.శ్రీకాంత్ (సి.ఐ.టి.యు) ఎంఏ. సలీం, ఎండి. నజీర్ (యు.టి.ఏ.డబ్ల్యూ.ఏ), వి. మారయ్య, నిరంజన్ (బి.ఆర్.టి.యు), వి.ప్రవీణ్ (టియుసిఐ), రామ్‌రెడ్డి (ఐ.ఎఫ్.టి.యు) సిహెచ్. జంగయ్య, ఎస్.అశోక్, ఎండి. ఒమర్ ఖాన్, ఏం. శ్రీనివాస్, ఏం.కృష (ఏఐటీయూసీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి నేడు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సిగ్గు చేటన్నారు. సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా అప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటో లను నిషేధించడం వంటి న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక ఆటో బంద్ చేపడుతామని బి. వెంకటేశం హెచ్చరించారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో

# అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

**ఎమ్మెల్యే యెన్నం**

విశాలాంధ్ర – హైదరాబాద్ : శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కొండపై కొలువైన సేవాలాల్ మరియమ్మ యాడి ఆలయం ఆవరణలో జరిగిన బోగ్ బండార్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సంత్ సేవాలాల్ మహారాజ్‌ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత ప్రతి తాండాకు బిటి రోడ్డు వేయాలనే సంకల్పం తీసుకున్నారని, అందులో భాగంగా మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ, మహబూబ్‌నగర్‌లో ఉన్న తాండాలలో బిటి రోడ్డు పనులకు 5 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రానున్న నాలుగు సంవత్సరాలలో ప్రతి తాండాకు బిటి రోడ్ వేస్తామని ఆయన స్పష్టం చేశారు. బంజారా లిపి గోర్ గోలి ఉందని తెలిసిందని, ముందుగా పెద్ద బాలశిక్ష తయారు చేయించి మీ పిల్లలకు నేర్పించాలని, అలాగే ఈ లిపిని 8వ షెడ్యూల్‌లో పొందుపర్చుకోవాలని తద్వారా మన బంజారా బిడ్డలకు ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. మహబూబ్‌నగర్ విద్యా నిధిలో పది శాతం గిరిజన బంజారా విద్యార్థులకు కేటాయిస్తామని ఆయన హామి ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కొన్నే ఉంటాయని, కాబట్టి మన బిడ్డలు వెయ్యి మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగే విధంగా మీరు తర్ఫీదు ఇవ్వాలని, గొప్ప లక్ష్యాలను సాధించేందుకు వారిని తయారు చేయాలని ఆయన సూచించారు. మీకు బ్యాంకు ద్వారా కోట్ల రూపాయలు ఫండ్ వచ్చే అవకాశం ఉందని కాబట్టి బంజారా బిడ్డలను పరిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని, అందుకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మనం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ తరతరాలుగా వస్తున్న మన సంస్కృతిని సాంప్రదాయాలను మనం కాపాడుకోవాలని, వాటిని ఎప్పటికి విడనాడవద్దని ఆయన కోరారు. వచ్చే ఏడాది మరింత వైభవంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు జరుపుకుందాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీడి జానకి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకు లు ఆర్.శేఖర్ నాయక్, కె.శేఖర్ నాయక్, చందర్ నాయక్, చత్రునాయక్, దేవుజా నాయక్, రాము నాయక్, గంగా రామ్ నాయక్, నార్యా నాయక్, గోపాల్ నాయక్, చంద్ర నాయక్, సుభాష్ నాయక్, దశరథ్ నాయక్, తానాజీ, లక్ష్మణ్ నాయక్, సంతోష్ నాయక్, శంకరాచారి పాల్గొన్నారు.

# ఘనంగా ధర్మభిక్షం జయంతి

విశాలాంధ్ర – హైదరాబాద్ : స్వతంత్ర సమరయోధుడు ప్రజల మనిషి, గీత పనివారిల సంఘం పితామహుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు ధర్మబిక్షం 103జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మహబూబ్ నగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాలకిషన్ నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మభిక్షం తన జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేసిన ప్రజల మనిషి అని కొనియాడారు. సూర్యాపేట పట్టణంలో కల్లుగీత వృత్తిలో జీవనం సాగిస్తున్న బొమ్మగాని ముత్తి లింగయ్య, గోపమ్మ దంపతులకు ఐదవ సంతానముగా 1922 ఫిబ్రవరి 15వ తేదీన జన్మించారన్నారు. చిన్నతనం నుండే అభ్యుదయ భావాలకు ఆకర్షితుడై, కార్మికులు, కర్షకుల, రైతుల సమస్యలపై అలుపెరుగని ఉద్యమాలు చేసిన ఆయన 5సంవత్సరాలు కఠిన కారాగారా శిక్షణ అనుభవిస్తూనే జైలు వెలుపల సాయిధ పోరాటాలకు మద్దతు ఇచ్చారన్నారు. అలాగే జైలు లోపల రాజకీయ ఖైదీల కోసం జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. 1952, 1957, 1962 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాలలో ధర్మ బిక్షం ఎక్కడ నుండి నిలబడిన అక్కనుండి ప్రజలు గెలిపించుకున్నారన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో 1990, 1995 సంవత్సరంలో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండో పర్యాయాలు భారీ మెజార్టీతో ప్రజలు ధర్మ బిక్షంను గెలిపించుకున్నారని వివరించారు. రెండోసారి పార్లమెంట్ ఎన్నికల్లో 480 మంది అభ్యర్థులు నిలబడగా ధర్మ బిక్షం గుర్తు కంకి కొడవలిని న్యూస్ పేపర్ లాంటి బ్యాలెట్ పేపర్లో గుర్తించి ఓటు వేసి 76,000 మెజార్టీతో గెలిపించడం భారత్ ఎన్నికల చరిత్రలో అపూర్వమైన సంఘటన అని అన్నారు. ధర్మ బిక్షం కార్మిక, కర్షక ,గీత, హమాలీ, రిక్షా, మెడికల్, లారీ వర్కర్స్, హెూటల్ వర్కర్స్, నాగార్జున డ్యాం నిర్మాణ కార్మిక సంఘం, సిమెంట్ వర్కర్స్ ఇలా ఎన్నో సంఘాలను స్థాపించి వారి హక్కుల సాధన కోసం కృషి చేసిన కార్మిక నాయకుడు కామ్రేడ్ ధర్మ బిక్షం అన్నారు. ఏనాడు కూడా సొంత ఆస్తులు సంపాదించాలన్న ఆలోచన లేని వ్యక్తి అని, కానీ నేడు ఒక్కసారి ఎన్నికల్లో గెలిస్తే హంగు ఆర్భాటాలతో సంపాదనే లక్ష్యంగా రాజకీయాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటితరం నాయకులు ధర్మ బిక్షంను మహనీయుడిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపల్లి రాము జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ బాషా, బసవరాజ్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మహేష్, బాల్ రాజ్, నిజాం, పాషా, ఇందిరమ్మ, సుజాత పాల్గొన్నారు.

## ప్రభుత్వం కూలిపోతుందని మాట్లాడడం సరికాదు

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య యుతంగా పూర్తి మెజారిటీ ఎమ్మెల్యేలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోతుందని దయాకర్ రావు మాట్లాడడం ఆయన అధికార దాహానికి నిదర్శన్నారు. ఆదరించి అందలం ఎక్కించిన తల్లి లాంటి టిడిపి పార్టీని మోసం చేసి తమ కులబంధువులైన ఆనాటి టిఆర్ఎస్ పార్టీ ఎల్పీలో టిడిపి ఎమ్మెల్యేలను విలీనం చేసింది వాస్తవం కాదా ? మోసం కుట్రలు ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడంలో దయాకర్ రావు దిట్ట కాబట్టి ఆయన కదలికలపై మాకు అనుమానం ఉందని, ఇట్టి విషయంలో సమగ్ర విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర డిజిపి ని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజల అభిమానం చూరగోరుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరాధారమైన ఆరోపణలు, బదనాం చేయాలని చూస్తే సహించేది లేదంటూ హెచ్చరిస్తూ ఖబర్దార్ దయాకర్ రావు అన్నారు. ప్రభుత్వం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని ద హెచ్చరిస్తున్నామని, తెలుగుదేశం పార్టీలో అన్ని పదవులు అనుభవించి డబ్బులు పదవులకు కక్కుర్తి పడి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ని మోసం చేసిన దయాకర్ రావు ది నేర చరిత్ర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని తెలియజేస్తున్నమనీ, తెలంగాణ రాజకీయాల్లో నమ్మకద్రోహానికి ఎర్రబెల్లి దయాకర్ రావు వారసుడనీ తెలిపారు.

## దీపాదాస్ మున్షి నిబద్ధత గల నాయకురాలు : మహేష్‌కుమార్ గౌడ్

విశాలాంధ్ర – హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జ్‌గా పని చేసిన దీపాదాస్ మున్షి నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ గల నాయకురాలు అని ఆమె పార్టీని బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేశారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కొన్ని దినపత్రికలు, ప్రసార మాద్యమాలలో దీపాదాస్ మున్షి పార్టీ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసారని ప్రచారం చేస్తున్నారని ఇది అవాస్తవమని ఆయన అన్నారు. దీపాదాస్ మున్షి కేరళ ఏఐసీసీ ఇంచార్జ్‌గా ఉంటూ తెలంగాణలో ఏడాది కాలం పాటు అదనపు బాధ్యతలు నిర్వహించారని, ఏఐసీసీ కొన్ని రాష్ట్రాల ఇంచార్జ్‌లను, సంస్థాగత మార్పులను చేస్తూ అందులో భాగంగా తెలంగాణకు పూర్తి బాధ్యతలతో మీనాక్షి నటరాజన్ ను నియమించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కేరళలో పూర్తి బాధ్యతలతో పనిచేయాల్సి ఉన్నందున ఇక్కడ కొత్త నియామకం జరిగిందే తప్ప ఎలాంటి చర్యలు కావని అన్నారు. దీపాదాస్ మున్షి, ప్రియరంజన్ దాస్ మున్షి సతిమణిగా, పెద్ద రాజకీయ కుటుంబ నేపత్యం, నీతి, నిజాయితీగా పని చేసిన చరిత్ర ఉందని, పార్టీని క్రమశిక్షణగా, సంస్థాగతంగా బలోపేతం చేసారని అన్నారు. ఆమెపై వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అలాంటి నిరాదర వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

# గిరిజన సాంస్కృతిక మూలాలను కాపాడుకోవాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి సీతక్క

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** బంజారా సంత్ శ్రీ సేవాలాల్ జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న సేవాలాల్ బంజారా భవన్లో ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన భోగ్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని భోగ కుండ్‌లో నెయ్యి, పవిత్ర ద్రవ్యాలు సమర్పించి, సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఉత్సవాలకు విచ్చేసిన వేలాది మంది లంబాడీ గిరిజన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాలకు అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఎంపీలు బలరాం నాయక్, అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, విప్ రాంచంద ప్రజా ప్రతినిధులు రాందాస్ నాయక్, రవీందర్ నాయక్, కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులను గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా. ఎ.శరత్ ఆధ్వర్యంలో అధికారులు, లంబాడీ కళాకారుల బృందాలు కళా ప్రదర్శనలతో ఆహ్వానిం చారు. అందరూ సేవాలాల్ విగ్రహం ముందు నగారా లను మోగించి, భోగ్ సమర్పించి పూలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ సేవాలాల్ చరిత్రను భావితరాలకు అందించడమే ఆ మహానుభావునికి మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. గిరిజన సాంస్కృతిక మూలాలను కనీసం సందర్భోచితంగానైనా ప్రదర్శించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజనులు తమ ఇళ్ళల్లోనైనా తమ తమ మాతృ భాషలను మాట్లాడుతూ తమ తమ అస్తిత్వాలను కాపాడుకోవాలన్నారు. గిరిజన సమాజ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వక్తలు ప్రస్తావించినట్లుగా వచ్చే సంవత్సరం ఎల్బీ స్టేడియం వంటి విశాలమైన స్థలంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించే అంశం, భారత రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్లో బంజారా భాషను చేర్చే అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బంజారా గురువులు, బంజారా గాయని రోహిణి, క్రికెటర్ కావ్యశ్రీ, పర్వతారోహకులు మోతె రాందాస్, భూక్యా యశ్వంత్, ఎంబ్రాయిడరీ కళాకారుడు బని నవీన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డా.ఎ.శరత్ అధ్యక్షత వహించారు. గిరిజన తెగల జాతీయ సంఘం సభ్యులు హుస్సేన్ నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపీ వి. హన్మంతరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బంజారా కళాకారులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, బంజారా సంఘాల సభ్యులు, వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్ రెడ్డి, టీసిఆర్, టీఐ సంచాలకులు డా.వి. సముజ్వల, చీఫ్ ఇంజనీర్ శంకర్, జీసీసీ జీఎం వి.సీతారామ్, ట్రైకార్ జీఎం. శంకర్‌రావు, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎనిమీ ప్రాపర్టీస్‌పై నివేదిక ఇవ్వండి...

### మంత్రి బండి సంజయ్ కుమార్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీ)కు సంబంధించి మార్చి నెలాఖరులోపు రికార్డుల పరిశీలన, గ్రౌండ్ సర్వే పూర్తి చేసి లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఎనిమీ ప్రాపర్టీస్‌పై సమీక్ష నిర్వహించడం ఇది రెండసారి. ఈ సమావేశంలో సెపీ ముంబై విభాగ అధికారులతోపాటు రెవిన్యూ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తొలుత రంగారెడ్డి జిల్లాలోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కొత్వాల్ గూడ, మియాపూర్ పరిధిలో ఉన్న వందలాది ఎకరాల ఎనిమి ప్రాపర్టీస్‌పై పురోగతి ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సర్వే నెంబర్ల వారీగా పురోగతిని వివరించారు. ఏళ్ల తరబడి పొజిషన్‌లో ఉన్న రైతులకు అన్యాయం జరగకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అట్లాగే బహదూర్ పురాలోని రికాబ్ గంజ్‌లో 710-724, 778-784 నెంబర్లలో 3300 గజాల ఎనిమీ ప్రాపర్టీ వివాదంలో ఉందని అధికారులు తెలిపారు. డీఎస్ డియోదీ గాలిబ్ పేరిట స్థలం ఉందని, ఈ స్థలం సర్వే నెంబర్, లొకేషన్ కూడా ట్రేస్ కావడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సెపీ అధికారులతోపాటు రాష్ట్ర రెవిన్యూ అధికారులు కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలోని అల్లంపల్లిలోని 426, 427, 428 సర్వే నెంబర్లలోని 17.22 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీస్‌లోని వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుభప్రద పటేల్ నూలి కుటుంబ సభ్యులు ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇందులో 2.18 ఎకరాలు రైల్వే లైన్ కోసం రైల్వే శాఖ తీసుకుందన్నారు. సెక్షన్ 8ఏ ప్రకారం ఎనిమీ ప్రాపర్టీ అని తెలియకుండా కొన్న వాళ్లు, వలస యజమానుల కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న స్థలాలతోపాటు, సెపీ, రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల క్రితం లీజుకిచ్చిన భూములకు సంబంధించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సెపీ అధికారులు తెలిపారు. తక్షణమే సెక్షన్ 8 ఏ ప్రకారం సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటక, కేరళలో సెపీ అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## బెస్ట్ బ్రాండింగ్ టీంగా భారతి సిమెంట్స్

**విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ :** బెస్ట్ బ్రాండింగ్ అండ్ అడ్వేర్టైజింగ్ టీం అఫ్ ది ఇయర్ గా అవార్డును భారతి సిమెంట్ టీం సభ్యులు విజయ్ కుమార్, పవన్ కుమార్ అందుకున్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవాటెల్‌లో బిజినెస్ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీ, ఈ అండ్ సీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దీనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 60కి పైగా పురస్కారాలు అందులో ఉన్నాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, టీజీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ లయన్ వై కిరణ్ (హానరరీ కాన్సుల్ ఆఫ్ బల్గేరియా, సీఈవో - సుచిరిండియా గ్రూప్), రవీందర్ రెడ్డి (మార్కెటింగ్ డైరెక్టర్ - భారతి సిమెంట్), వేణు వినోద్ (మేనేజింగ్ డైరెక్టర్-సైబర్ సిటీ బిల్డర్స్, డెవలపర్స్), ఎం.రాజ్ గోపాల్ (మేనేజింగ్ డైరెక్టర్-హై బిజ్ టీవీ, తెలుగు నౌ), డాక్టర్ జె. సంధ్యారాణి (మేనేజింగ్ డైరెక్టర్ - హై బిజ్ టీవీ ఎల్.ఎల్.పి) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

**విశాలాంధ్ర - ఆమనగల్లు :** బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కలసి కృషి చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆమనగల్లు, కడ్తాల్ పట్టణ కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల ఆరాధ్యుడు సంతు సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. కల్వకుర్తి రోడ్డు హైదరాబాదు శ్రీశైలం జాతీయ రహదారి పక్కన సేవాలాల్ ఘాట్ వద్ద గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని, సేవాలాల్ విగ్రహానికి పూల మాలలు వేసే ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు గిరినులు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు తమ సాంప్రదాయ వేషధారణతో అలరించారు. సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరైన నాయకులు మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి సేవాలాల్ చేసిన కృషిని కొనియాడారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసి సంస్కరణలకు స్వీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము,గిరిజన నాయకులు పత్యానాయక్, దశరత్ నాయక్, రవీందర్, కృష్ణ, రాంపాల్,శంకర్,రాములు,సురేష్, రమేష్, వినోద్, చందు, అమర్ సింగ్, ప్రశాంత్, పవన్, శంకర్, మణిపాల్, గణేష్, విజయ్, నరేష్, రవిరాథోడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్:** అర్హులైన పేద బలహీనవర్గాలైన మున్సిపల్ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలనీ ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షాబీర్ అలీకి వినతిపత్రం, మున్సిపల్ కార్మికుల జాబితాను అందజేశారు.అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్ర జెండా పేద, బలహీన వర్గాల వైపు ఉంటుందని కనుక ఏ ప్రభుత్వం అధికారం లో వున్న పేదలకు అన్యాయం చేస్తే ముందుగా ఉండేది ఎర్ర జెండానే అని గుర్తు చేశారు. గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నందు ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లుల సంఖ్యలో అనేక అవకతవకలు ఉన్నాయని, పేద ప్రజలకు కాకుండా పెద్ద భవనాలు కలిగి ఉన్న వారికే లిస్టులో పేరు వచ్చిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్లో కూడా అనేక అవకాతకాలు వున్నాయి. కనుక పేద ప్రజల అపోహాలు తొలగించి వెంటనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, అలాగే నిజాంపేట్ మున్సిపల్‌లో ఒక గ్రూప్ లీడరును మార్చడం వల్ల అ గ్రూపులో పనిచేసే కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు రావడం లేదని వారికీ వెంటనే జీతాలు వచ్చే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు గండికోటే అనుమతిలేని అక్రమ భవనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని గతంలో పాలకవర్గానికి బయపడి కొంత వెనకడుగు వేసిన ఇప్పుడు వున్నా అధికారులకు పూర్తి అధికారం ఉంటుంది. కనుక వెంటనే అటి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని, ఒక మంచి పనికి భారత కమ్యూనిస్ట్ పార్టీ బాచుపల్లి మండల పక్షాన పూర్తి మద్దతు ఇస్తామని, లేని పక్షంలో పెద్ద ఎత్తున అర్హులైన పేద, బలహీన వర్గాలను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## మూట్ ట్రైబ్యునల్ పోటీలతో చట్టపరమైన నైపుణ్యాలు అభివృద్ధి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మూట్ ట్రిబ్యునల్ పోటీలు చార్టెడ్ అకౌంటెంట్, లా విద్యార్థులకు చట్టపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్, బిర్లా ప్లానిటోరియం, భాస్కర ఆడిటోరియంలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ 4వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు 2025 నిర్వహిం చింది. దాదాపు 300 మంది క్వాలిఫైడ్ చార్టెడ్ అకౌంటెంట్, లా విద్యార్థులు ఈ వృత్తిపరమైన పోటీలలో పాల్గొనగా ఆదాయపు పన్ను అప్పిలియట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్, జ్యూడిషల్ సభ్యులు కె.నరసింహ చారి, అకౌంటింగ్ సభ్యులు మధుసూదన్ సావ్డియా జడ్జిలుగా వ్యవహరించారు. ఈ మూట్ ట్రిబ్యునల్ పోటీలను ఆదాయపు పన్ను అప్పిలియట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షులు విజయ్‌పాల్‌రావు ప్రారంభించగా జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఈ వృత్తిపరమైన పోటీలను నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలుపుతూ, ఇది సీఏ, లా విద్యార్థులతోపాటు నిపుణులందరికీ ఇటువంటి పోటీలలో పాల్గొనడం ద్వారా వాదించడానికి వారి న్యాయపరమైన చతురతను పెంపొందించడానికి చక్కని అవకా శం ఇస్తుందన్నారు. మూట్ ట్రిబ్యునల్ పోటీలు అన్ని ముఖ్యమైన చట్టపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని, ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లను పెంచుతుందని, విద్యార్థు లను న్యాయశాస్త్రంలో విజయవంతమైన కెరీర్‌కు సిద్ధం చేస్తుందని పేర్కొ న్నారు. విజయ్‌పాల్‌రావు మాట్లాడుతూ పన్ను చట్టాలు సాధారణ చట్టాలు కావని, టాక్స్ ఎక్స్పర్ట్‌గా ఎదగడానికి సీఏ, లా విద్యార్థులు సుదీర్ఘమైన శిక్షణ తీసుకోవడం అవసరం అని, కొత్త పన్ను చట్టాలపై కూడా అవగాహనా పెంచవలసిన అవసరముందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ 4వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు 2025 నిర్వహణ చైర్మన్ అమృత్ కుమార్ కోట, అసోసియేషన్ అధ్యక్షులు హితేష్ జైన్, ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ వేముల, సలహాదారు రామ్ దేవ్ బూత్రా, కోశాధికారి ఆశిష్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# కులగణనలో నమోదు కాని వారికి మరో అవకాశం

### ఈనెల 16 నుండి 28వ తేదీ వరకు సర్వే

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** కుల గణన లో ఇప్పటి వరకు నమోదు కానీ వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యం లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ను ఏర్పాటు చేసారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందన్నారు. ఇప్పటి వరకు కుల గణనలో నమోదు కానీ కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్‌కు కాల్ చేసి వారి, మొబైల్ నెంబర్, అడ్రస్‌తో పాటుగా పోస్టల్ పిన్ కోడ్ నెంబర్‌ను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. కాల్‌సెంటర్ లో కాల్ వచ్చినప్పుడు ఆపరేటర్ చేయవలసిన నియమ నిబంధనలు గురించి శనివారం కంప్యూటర్ ఆపరేటర్లకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అవగాహన కల్పిం చారు. కాల్ సెంటర్‌లో ఆపరేటర్ ప్రవర్తించా ల్సిన పద్ధతిపై వివరించారు. ఈ కాల్ సెంటర్ జిహెచ్ఎంసి పరిధితో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన కాల్స్ కూడా స్వీకరించి, అట్టి వివరాలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఫార్వర్డ్ చేస్తారు. అయితే కాల్ చేసే వ్యక్తి పూర్తి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫోన్ నెంబర్, పూర్తి అడ్రస్, పిన్ కోడ్ నెంబర్ తెలియజేయాల్సి ఉంటుంది. కాల్ సెంటర్‌కు కాల్ వచ్చిన సందర్భంలో ఆపరేటర్ ముందుగా అడగాల్సిన అంశాలను ఈ శిక్షణ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వివరిం చారు. కులగుణనలో నమోదు కాని వారి కోసం ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుండి 28వ తేదీ వరకు మరోసారి సర్వే కొనసాగిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాల్ సెంటర్ ద్వారా పేరు, వీధి, గ్రామం, మొబైల్ నెంబర్, ఇంటి నెంబర్, పట్టణాలలో అయితే సర్కిల్ లేదా వార్డు నెంబర్ వివరించిన పక్షంలో అడ్రస్ ప్రకారం ఎన్యుమరేటర్ వారి ఇంటికి వెళ్లి కులగణన చేస్తారు. మొబైల్ నెంబర్ తో సెర్చ్ చేసి సంబంధిత వ్యక్తి పాత డేటా బేస్ లో నమోదు అయ్యారా లేదా వివరాలు ఉన్నాయా అన్నది పరిశీలించి, లేని పక్షంలో సంబంధిత వ్యక్తి, పేరు, అడ్రస్ అడుగుతారు. ముందుగా జీహెచ్ఎంసీనా లేదా నాన్ జీహెచ్ఎంసీనా అన్న వివరాలు అడుగుతారు. జీహెచ్ఎంసీ పరిధి కానటువంటి వారైతే మున్సిపాలిటీ వార్డు నెంబర్, అడ్రస్, గ్రామం అయితే మండలం, ఆయా వివరాలను తెలియజేసి పక్షంలో ఎన్యుమరేటర్ ఇంటి వద్దకు వచ్చి కుల సర్వే చేస్తారు. ఇప్పటి వరకు కులగణన సర్వేలో నమోదు చేసుకోని వారు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## శివ కుమార్ యాదవ్‌కి కొలను శుభాకాంక్షలు

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ 4వ డివిజన్ నివాసులు శివకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి దీవెనలు తీసుకున్నారు. అనంతరం కొలను శ్రీనివాస్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ శివ కుమార్ యాదవ్‌ని శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర కుమార్ యాదవ్, పవన్, యోగేందర్, సుబ్బు, చంద్రశేఖర్, వెంకట్రావు, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల ఫోరమ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌రావు

**విశాలాంధ్ర-బషీర్ బాగ్ :** తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా కె. శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. హ్యూమన్ రైట్స్ ఫోరంకు జాతీయ పరిపాలనా అధ్యక్షులు గంటా స్వామి శనివారం ఉదయం కందుల శ్రీనివాసరావును తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నారుల హక్కులు, మహిళలు హక్కులు భద్రత కోసం రాష్ట్రంలో దృష్టి పెట్టి మానవ హక్కుల సంఘం ద్వారా సేవలందిస్తానని తెలిపారు. సమాజంలో ఎక్కడ మానవ హక్కులకు భంగం వాటిల్లినా, సమస్యలు సృష్టించిన వారిపై న్యాయ సంస్థలు ద్వారా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## మీడియా ప్రజల పక్షాన నిలబడాలి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మీడియా ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరు సోదర భావంతో ఉన్నారని ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో సైతం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపాల్టీగా ఉన్న మహబూబ్‌నగర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిందని ఆయన చెప్పారు. అందుకు మన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మనందరం కలిసి మహబూబ్‌నగర్‌ను హైదరాబాద్ అంత అభివృద్ధి చేసుకుందా మన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు తెచ్చుకొని త్వరితగతిన మహబూబ్‌నగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని ఆయన పునరుద్ఘాటించారు. తన పరిధిలో ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరిస్తానని, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేని గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఐజెయు జిల్లా అధ్యక్షుడు జెమిని శేఖర్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సీనియర్ జర్నలిస్టులు పవన్, విజయరాజు, భాస్కరరావు, రఫీ, అలీమ్, విద్యాసాగర్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, పేట వెంకటయ్య, కే రవీందర్, సతీష్ రెడ్డి, శ్రీను, రామకృష్ణ, గోకులం వెంకటేష్, రవి, మాణిక్‌రావు, ప్రభులింగం పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాదయాత్ర

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి తండాలో స్థానిక ప్రజా సమస్యలపై గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పాద యాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ కాలనిలో భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి పుప్ లైన్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే కార్పొరేటర్ స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన నిధులు కేటాయించి సమస్య ను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరే టర్ ఆదేశించారు. డ్రైనేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్‌తో అనుసంధానం చేస్తూ ఒక కాలనీ నుండి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్ధంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. పురాతన నీటి పైపులైన్‌లను ఆధునిక పైపులైన్‌లతో మార్చి, నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచి పరిపుష్టమైన మంచినీటి సరఫరా కోసం కొత్త మోటార్‌లు, పంప్‌హౌస్లు ఏర్పాటు చేస్తామని అన్నారు.

## భూసేకరణ నిమిత్తం భూపరిశీలన చేసిన కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** జీనోం వ్యాలీ మెయిన్ రోడ్డు నుండి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పార్కుకు గాను ప్రత్యా మ్నాయ రోడ్డు కోసం భూసేకరణ నిమిత్తం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం క్షేత్రస్థాయి భూపరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మ్యాప్‌లను పరిశీలించి మురారిపల్లి గ్రామస్తుల అభిప్రాయా లను అడిగి తెలుసుకున్నారు. ప్రజయ్ వాటర్ ఫ్రంట్ ముందు నుండి రోడ్డుకై స్థలాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు : రాజ్‌కుమార్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీపై కన్వర్టెడ్ బిసి అని అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు డా.వై.రాజ్ కుమార్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. ముందుగా జంధ్యం లేని రాహుల్ గాంధీ బ్రాహ్మణుడు ఎలా అవుతారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్



**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** మియాపూర్‌లోని నడిగడ్డ తండాలో సేవా లాల్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పోరేటర్ రంగారావు, గోపరాజు శ్రీనివాస్‌రావు, కలిదిండి రోజా, బిఎస్ఎన్ కిరణ యాదవ్, మారబోయిన రవి యాదవ్, ఎర్రవల్లి సతీష్, వాలా హరీష్‌రావు, గొట్టుముక్కల పెద్దబస్కర్‌రావు, బిఆర్ఎస్‌వి యశ్వంత్ కుమార్, శ్రీనివాస్, రమేష్ యాదవ్, ముజీబ్, బాబూమోహన్ మల్లేష్, రాజు అమలవలస రాజు వడ్డే రాజ్, రామకృష్ణ గౌడ్, సతీష్ తిరుపతి నాయక్, గోపాల్ నాయక్, సీతారాం నాయక్, శ్రీధర్ ముదిరాజ్, రెడ్డి నాయక్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నియో జకవర్గ మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా సోదరులను కలవడ మంటే కాంగ్రెస్ కుటుంబ సభ్యులను కలుసుకున్నంత ఆనందంగా ఉందని,1976లో ఇందిరమ్మ నాయకత్వంలో బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చారు. నాయకులు వీరేందర్ గౌడ్, మనెపల్లి సాంబశివరావు, తిరుపతి, యాలమంచి ఉదయ్‌కిరణ్, రవి కుమార్, ప్రభాకర, రెహమాన్, గోపాల్ నాయక్, బాలు నాయక్, శివ, రవి, తండా ప్రజలు పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి పిలుపు మేరకు మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బందితో కలిసి నిర్వహించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. సోర్సు-రిసోర్సు థీమ్‌లో భాగంగా వేసవి దృష్ట్యా నీరు వృధా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ బాటిల్స్‌లో తాగి వదిలేసే నీటిని మొక్కలకు పోయాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రం చేశారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడం, పేపర్లు, కంప్యూటర్ వేస్టేజ్ రీయూజ్‌పై సూచలు ఇచ్చారు. భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, ఇదే సంప్రదాయాన్ని మునుముందు వారు కొనసాగించడానికి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ఉపయోగపడు తుందన్నారు.

# గిరిజనుల్లో వెలుగులు నింపుతాం

**సేవాలాల్ సేవలు భావితరాలకు ఆదర్శనీయం**

**నివాళులర్పించిన సీఎం చంద్రబాబు**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమగ్ర ప్రణాళికతో గిరిజనుల్లో పేదరికాన్ని నిర్మూలిస్తామని, గిరిజన చట్టాలను కాపాడతామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గిరిజనులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎన్టీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ఆయన స్ఫూర్తితో గిరిజనులకు రాజకీయ అవకాశాలు కల్పించి అండగా నిలిచామని తెలిపారు. శనివారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. తన బోధనలు, రచనలతో సమాజాన్ని చైతన్య పరిచిన సేవాలాల్ జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. 288 ఏళ్ల క్రితం పుట్టిన భారతీయ సామాజిక మత సంస్కర్త, బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ తన బోధనలతో ఈ ప్రపంచానికి దశ దిశా నిర్దేశించారని అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తి ప్రజలను ఎంతలా ప్రభావితం చేస్తారు, వారు అవలంభించిన సిద్ధాంతాలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఎలా నిలిచిపోతాయనే దానికి సేవాలాల్ నిదర్శనమన్నారు. ఆ మహనీయుడు పుట్టిన గ్రామంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.50 లక్షలు విడుదలకు ఆదేశించామన్నారు. మూడు శతాబ్దాల క్రితమే మూఢ నమ్మకాలను రూపు మాపేందుకు సేవాలాల్ ఎంతో కృషి చేశారని. మహాత్ముని కంటే ముందే అహింసా మార్గాన్ని బోధించారని తెలిపారు. సేవాలాల్ ఒక్క ఏపీకే కాకుండా దేశమంతా తిరిగి విద్య, వైద్యంపై ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. సేవాలాల్ వంటి మహనీయుల స్ఫూర్తితో సమాజహితం కోసం పని చేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. సేవాలాల్ ఆశయాలను చిత్తశుద్ధితో అమలు చేసి గిరిజనులను అన్నివిధాలా పైకి తీసుకువస్తామని, బంజారాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, అందుకు తగిన సహాయ, సహకారాలు అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## టెక్స్‌టైల్ పరిశ్రమలకు ఏపీ అనుకూలం: రేఖారాణి

**భారత్ టెక్స్‌లో పెట్టుబడిదారులతో కీలక చర్చలు**

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: న్యూఢిల్లీలో నిర్వహించిన భారత్ టెక్స్... ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధులు పెట్టుబడిదారులతో కీలక చర్చలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు వివరించారు. ప్రపంచ పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ నూతన జౌళి విధానాన్ని రేఖా రాణి పరిచయం చేశారు. టెక్స్‌టైల్ అపారెల్, గార్మెంట్స్ పాలసీ కి విశేష స్పందన లభించింది. రేఖా రాణి మాట్లాడుతూ, మెరుగైన రవాణా వ్యవస్థ, ప్రపంచ స్థాయి పోర్ట్ కనెక్టివిటీ, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందన్నారు. కర్నాటకకు చెందిన పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఆసక్తి చూపారు. కర్నూలు జిల్లా యెమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్ స్థాపనపై చర్చించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ప్రతినిధులతో సమావేశమై, హస్తకళల కార్మికులకు కొత్త డిజైన్లు, మార్కెట్-ఓరియెంటెడ్ ఉత్పత్తులను పరిచయం చేయడం, అంతర్జాతీయ మార్కెట్లలో వారి ఉత్పత్తులకు గిరాకీ పెంచడంపై చర్చించారు. హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక మండలి ద్వారా రష్యా ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. హస్తకళల ఉత్పత్తులను రష్యా మార్కెట్‌కు ఎగుమతి చేసే అవకాశాలను చర్చించారు.

## భారత్‌లో ప్రజాస్వామ్యం పటిష్టం

**వర్ధమాన దేశాలపై పాశ్చాత్య దేశాల చిన్నచూపు**

**కేంద్రమంత్రి జైశంకర్**

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంపై పాశ్చాత్యదేశాలు అనుసరిస్తున్న రెండు నాల్కల ధోరణిని కేంద్ర విదేశాంగ శాఖమంత్రి జై శంకర్ ఖండించారు. జర్మనీలోని మ్యూనిచ్‌లో భద్రతా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలకు చెందిన ప్రజాస్వామ్య విధానాలను మాత్రమే ఆ దేశాలు అనుసరిస్తున్నాయని, అదే సమయంలో ప్రజాస్వామ్య విరుద్ధమైన భావాలను వర్ధమాన దేశాలపై ఎగదోస్తున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో భారత్ అనుసరిస్తున్న విధానం ప్రపంచంలోని అనేక దేశాలు అనుసరించేందుకు వీలుగా ఉందన్నారు. వర్ధమాన దేశాల్లో విజయవంతమైన నమూనాలను పాశ్చాత్యదేశాలు అనుసరించేందుకు కిందకు దిగి రావాలన్నారు. ఇప్పటికీ తమదే సరైన ప్రజాస్వామ్యమని, ఇతర దేశాలది తక్కువనీ ఆ దేశాలు భావిస్తున్నాయన్నారు. చారిత్రకంగా చూస్తే భారత సమాజం అందరినీ ఆహ్వానిస్తుందన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రజాస్వామ్య వ్యవస్థగా మనుగడ సాగిస్తోందన్నారు. దేశంలో జరిగిన అనేక పరిణామాల్లో జరిగిన అభివృద్ధే ప్రజాస్వామ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు భారత్ నిలువుటద్దమన్నారు. పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ప్రజాస్వామ్య విజయాలను గుర్తించి... వాటిని తమ దేశ వ్యవస్థల్లో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచీచెడులపై విశ్లేషణకు కొందరు స్వయం ప్రకటిత మేధావులు వస్తున్నారని, అసలు సమస్య వీళ్లతోనేనని ఆయన అసహనం వ్యక్తంచేశారు. వీరు ఏ ఎన్నికల్లోనూ పోటీచేయరు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎలాంటి కృషి చేయరు, అయినా సలహాలిస్తుంటారని మంత్రి విరుచుకుపడ్డారు. సమాజంలో అణచివేతకు గురైన వారికి న్యాయం చేయడంలో పాశ్చాత్యులు ఎలాంటి విధానాలు అనుసరించారని ప్రశ్నించారు. అదే భారత్‌కు వచ్చేసరికి విమర్శలు చేయడం ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎలాంటి ప్రమాదం లేదని, ఎలాంటి వివక్ష లేకుండా 80 కోట్ల మందికి రేషన్ అందుతున్న వైనాన్ని ఉదహరించారు. భారత ప్రజాస్వామ్యం దాని లక్ష్యాలను సాధిస్తోందన్నారు. భారత రాజకీయాలను ఆశావహ దృక్పథంతో చూస్తున్నానన్నారు. గత ఏడాది జరిగిన భారత సార్వత్రిక ఎన్నికల్లో 70 కోట్లమంది స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడం భారత ప్రజాస్వామ్య విజయమన్నారు. రష్యాపై ఆంక్షలున్నా భారత్ అక్కడి నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని మంత్రి జైశంకర్ ప్రస్తావించారు. ఈ విధానంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగకుండా చూశామన్నారు. ఈ కార్యక్రమంలో నార్వే ప్రధాని జొనాస్ గర్‌స్టోర్, అమెరికా సెనెటర్ ఎలిసా స్లాట్కి, వార్సా మేయర్ రమఫల్ ట్రజస్కోవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు అమోఘం

**యుఫోరియా మ్యూజికల్ నైట్‌లో సీఎం చంద్రబాబు**

**రూ.50 లక్షల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తలసేమియా బాధితులను ఆదుకోవడం కోసం సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యాన శనివారం రాత్రి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 'యుఫోరియా మ్యూజికల్ నైట్' ప్రేక్షకులను రంజింపజేసింది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ అధ్వర్యంలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ కు ముఖ్య అతిథిలుగా సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, సినీ నటుడు బాలకృష్ణ హాజరయ్యారు. తలసేమియా వ్యాధి పై అవగాహన కల్పించడం, బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా మ్యూజికల్ నైట్ నిర్వహించారు. పవన్ కల్యాణ్ ఎన్టీఆర్ ట్రస్ట్‌కు రూ.50 లక్షల విరాళం ప్రకటించారు. చంద్రబాబు మాట్లాడుతూ భువనేశ్వరి... హెరిటేజ్‌నే కాకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ కూడా సమర్థవంతంగా నడిపిస్తుందని కొనియాడారు. ఎన్టీఆర్ ఎంత మొండి ఘటమో భువనేశ్వరి కూడా అంతేనన్నారు. మంచి పాలనతో పాటు మంచి సమాజం కోసం కృషి చేసిన నేత ఎన్టీఆర్ అన్నారు. విద్య,వైద్యం, తాగు నీరు, నైపుణ్య శిక్షణ తదితర రంగాల్లో ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలుంటాయని స్పష్టం చేశారు. ఒక మంచి పనికి స్పందన ఏమిటంటే పవన్ కల్యాణ్ రూ.50 లక్షల విరాళం ఇవ్వడమే ఉదాహరణగా పేర్కొన్నారు. 28 ఏళ్లుగా ఎన్టీఆర్ ట్రస్ట్ గాని, హెరిటేజ్ సంస్థ గాని ఎక్కడా తప్పుదోవ పట్టలేదన్నారు. సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలకు వెచ్చించి ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని సార్థకత చేసుకోవాలని కోరారు.

## సాంకేతికతతో నేరాలకు చెక్

- పోలీసులు, పీపీలు సమన్వయంతో పనిచేస్తే సత్వర న్యాయం
- న్యాయ విచారణలో డిజిటల్ ఎవిడెన్స్ పాత్ర కీలకం
- హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను నియంత్రించడంతోపాటు ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ జీఆర్టీ హోటల్లో ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్ అధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యతపై జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి మాట్లాడారు. సమాజానికి ధైర్యమిచ్చే వారు పోలీసులైతే... ప్రజలకు న్యాయం చేసేవారు పబ్లిక్ ప్రాసిక్యూటర్లని అన్నారు. మారుతున్న కాలంలో న్యాయ విచారణలో డిజిటల్ ఎవిడెన్స్ పాత్ర చాలా కీలకంగా మారిందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీ) అందరినీ ఒకచోట చేర్చి ఇలాంటి సదస్సు నిర్వహించడం సంతోషదాయకమని, వీరిలో 50 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ఉండడం శుభపరిణామమన్నారు. న్యాయవిచారణను వేగంగా పూర్తి చేసేందుకు తొలి అడుగు పడిందన్నారు. నేరస్థులను పట్టుకోవడానికి అందరం కలిసి సాంకేతికంగా మరింత అప్‌గ్రేడ్ అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కలిగించడం చాలా ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి చిన్న విషయాలను కూడా నిశితంగా పరిశీలిస్తారన్నారు. నేరానికి సంబంధించి ఆధారాలిచ్చేది పోలీసులు అయితే... వారికి శిక్షపడేలా చేయాల్సింది పీపీలని అన్నారు. పోలీసులు, పీపీలు కలిసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుదామన్నారు. ఇప్పటి నేరాలను చూస్తే దొంగలు చాలా తెలివిమీరిపోయారని తెలుస్తుందని, ఎంతటి తెలివిగలవారైనా ఎక్కడో ఒకచోట ఆధారం వదలి వెళతారని, దానిని గుర్తించగల్గితే నేరస్థులు పట్టుబడతారన్నారు. పోలీస్, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పనిచేస్తే నిర్దేశిత సమయంలోనే నేరస్థులకు శిక్ష పడుతుందన్నారు. ఎంతటివారైనా కోర్టుకు వస్తే చేతులు కట్టుకుని నిల్చునేంతటి గౌరవం మన న్యాయ వ్యవస్థకుందని, అదేవిధంగా పోలీసులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ప్రజలు గౌరవించే విధంగా మనం చేయాల్సి ఉందన్నారు. దొంగతనాలు, నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అవసరమన్నారు. విజయవాడలో ప్రొటోకాల్ లేకుండా ట్రాఫిక్‌లో ప్రయాణించి ప్రజల కష్టాలు తెలుసుకునే ప్రయత్నం చేశానని, అస్ట్రామ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గించడం సులభంగా చేస్తున్నారని పోలీసులను అభినందించారు. సమాజ గౌరవం, ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడే దిశగా పీపీలు పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకుసాగుదామని మంత్రి వంగలపూడి అనిత పిలుపినిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రామకోటేశ్వరరావు, ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) సంస్థ డైరెక్టర్ ఆకే రవికృష్ణ తదితరులు ప్రసంగించారు.

## నరసింహారావు కుమార్తె వివాహానికి సీపీఐ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: విశాలాంధ్ర గుంటూరు, పల్నాడు జిల్లాల ఇంఛార్జ్ వి.ఎల్.నరసింహారావు కుమార్తె వివాహం శనివారం గుంటూరు నగరంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు హాజరయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి వై.చెంచయ్య, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోలా స్వాతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, సీపీఐ జిల్లా కార్యాలయ కార్యదర్శి రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్ (శశి), నగర కార్యదర్శి బన్ని, రేపల్లె నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, పల్నాడు జిల్లా నాయకులు బైరాపట్నం రామకృష్ణ, మునుగోటి శ్రీనివాస్ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నా బిడ్డకు తండ్రి ఎలాన్ మస్క్

**వెల్లడించిన రచయిత్రి... స్పందించని మస్క్**

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు సంబంధించి రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన విషయం వెల్లడించారు. తన బిడ్డకు తండ్రి మస్క్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. 'ఐదు నెలల క్రితం నేనో బిడ్డకు జన్మనిచ్చాను. నా చిన్నారికి ఎలాన్ మస్క్ తండ్రి. మా బిడ్డ గోప్యత, భద్రతను దృష్టిలోఉంచుకొని ఇంతకుముందు నేను ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదు. కానీ కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఆ విషయాన్ని బయటపెట్టాలని ప్రయత్నించాయి. అందుకే నేనే వెల్లడిస్తున్నా. మా సంతానం సురక్షిత వాతావరణంలో జీవించాలని నేను కోరుకుంటున్నాను. మా గోప్యతకు ఎవరూ భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను' అని తన పోస్టులో కోరారు. దీనిపై మస్క్ నుంచి ఎలాంటి స్పందన లేదు. మస్క్‌కు 12 మంది సంతానం. మొదటి భార్య జస్టిన్‌కు జన్మించిన తొలిబిడ్డ అనారోగ్య కారణాలతో 10 వారాలకే మృతి చెందింది. తర్వాత ఆ జంట ఐవీఎఫ్ పద్ధతిలో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. 2008లో వారిద్దరూ విడిపోయారు. తర్వాత బ్రిటన్ నటి తాలులాహ్ రిలేను వివాహమాడారు. అయితే వారికి సంతానం లేదు. అనంతరం కెనడియన్ గాయని గ్రిమ్స్‌తో సంబంధం నెరిపారు. వారికి ముగ్గురు పిల్లలు. తన ప్రతిష్ఠాత్మక సంస్థ బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో పనిచేస్తోన్న ఎగ్జిక్యూటివ్‌తోనూ మరో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చినట్లు ఇటీవల మస్క్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. మస్క్-జస్టిన్ దంపతులకు పుట్టిన జేవియర్ అలెగ్జాండర్ కొంతకాలం క్రితం అమ్మాయిగా మారారు. తన తండ్రితో కలిసి జీవించకపోవడంతో పాటు ఆకారం లేదా ఇతర ఏ రూపంలోనూ ఆయనతో సంబంధం లేకుండా ఉండాలని కోరుకుంటు న్నట్లు జేవియర్ వెల్లడించారు. జేవియర్ పేరును జెన్నా విల్సన్‌గా పేరు మార్చుకున్నారు. దీనిపై మస్క్ స్పందిస్తూ 'జెన్నాకు కమ్యూనిస్టు భావాలు ఎక్కువ. డబ్బు ఉన్న వాళ్లందరూ చెడ్డవాళ్లని భావిస్తుంది. ఆమె అలా మారడానికి తను చదువుకున్న స్కూలే కారణం' అని అన్నారు.

## ప్రభుత్వాల అలసత్వంతో గ్రంథాలయాలు నిర్వీర్యం

**పునర్వికాస ఉద్యమానికి శ్రీకారం: వల్లూరి**

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ప్రభుత్వాల అలసత్వం ఫలితంగా గ్రంథాలయాలు నిర్వీర్యమైపోతున్నాయని పునర్వికాస ఉద్యమ సంఘం రాష్ట్ర కన్వీనర్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో శనివారం అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రారంభోత్సవం జరిగింది. వల్లూరి మాట్లాడుతూ శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాలు తప్ప మిగిలిన పూర్వ పదకొండు జిల్లాల నుంచి సమాచార హక్కు చట్టం కింద సమాచారం మేరకు గ్రంథాలయాల పన్ను పేరుతో ప్రజల నుంచి రూ.737.25 కోట్లు వసూలు చేసినట్టు చెప్పారు. రూ.17.47 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. సెస్ పేరుతో వసూలు చేసిన సొమ్మును 1983 వరకు గ్రంథాలయాల నిర్వహణ, అభివృద్ధి కి ప్రభుత్వాలు ఖర్చు పెట్టేవన్నారు. ఆ తరువాత గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వచ్చాయని, సెస్ ను ఇతర ఖర్చులకోసం మళ్లించుకున్నారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గ్రంథాలయ ఉద్యమాన్ని అయ్యంకి వెంకటరమణయ్య, వెలగా వెంకటప్పయ్య వంటి మహానుభావులు నడిపారని గుర్తు చేశారు.

అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేవాలయాలపై ఉన్న శ్రద్ధ గ్రంథాలయాలపై పాలకులు చూపటం లేదన్నారు. ఆలయాలు యాచకుల్ని పెంచుతాయని, గ్రంథాలయాలు మేధావుల్ని పెంచుతాయని అన్న సత్యాన్ని గుర్తు చేశారు. మేధావులు పెరిగితే ప్రభుత్వాలను ప్రశ్నించే వారి సంఖ్య ఎక్కువ అవుతుంది గనుక, గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా చిన్నచూపు చూస్తున్నాయనే అనుమానం కలుగుతుందని అన్నారు. ప్రముఖ రచయిత అంటాడు అప్పలనాయుడు మాట్లాడుతూ, పంచాయతీల స్థాయిలో గ్రంథాలయాలు కనుమరుగయ్యాయని చెప్పారు.అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతి శ్రీ మాట్లాడుతూ, కొత్త తరాల జ్ఞాన వికాసానికి ఈ పునర్వికాస ఉద్యమం అవసరమని, అభ్యుదయం కోసం తపించే మేధావి వర్గం ఈ ఉద్యమంలో భాగస్వాముల కావాలని కోరారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలో ప్రైవేటు గ్రంథాలయాల ప్రగతిని వివరించారు. వాటి నిర్వాహకులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని కోరారు. సాహితీ ప్రవంతి జిల్లా కన్వీనర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ ఉద్యమానికి తమ సంస్థ పూర్తి మద్దతును ప్రకటిస్తుందని చెప్పారు. ఇటీవల మరణించిన అభ్యుదయ ఉద్యమ నాయకుడు వీజీకే మూర్తి పేరుతో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. ఈ గ్రంథాలయానికి రూ.పదివేల విలువ గల పుస్తకాలను అందజేస్తానని నల్లి ధర్మారావు ప్రకటించారు.

తొలుత అతిథులను వేదికపైకి అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణా రావు ఆహ్వానించారు. విద్యా సంస్థల అధినేత జామి భీమశంకర రావు, గురజాడ అధ్యయన పీఠం అధ్యక్షురాలు పత్తి సుమతి, బూర్జ మండల ఉపాధ్యక్షుడు బుడుమూరు సూర్యారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి టి తిరుపతిరావు, విశ్రాంత ఇంజనీర్ బి ఎ మోహన రావు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి మల్లేశ్వరరావు , జీవి నాగభూషణరావు, పాలకొండ డివిజన్ గ్రంథాలయ ఉద్యమ నాయకులు సుబ్బా నానాజీ పాల్గొన్నారు.

### గ్రంథాలయ పునర్వికాస జిల్లా ఉద్యమ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ విజయనగరం జిల్లా కమిటీ ఏర్పాటైంది. జిల్లా కన్వీనర్ గా జి.ఎస్. చలం, కో కన్వీనర్‌గా అబ్దుల్ రవూఫ్‌ని ఎన్నుకొన్నారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, జయంతి స్మారక జిల్లా గ్రంథాలయ సంఘం, నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం, అభ్యుదయ రచయితల సంఘం, విజయనగరం రీడ్స్ సంస్థల ప్రతినిధులు రత్నాల బాలకృష్ణ, ఎస్.ఎస్.ఎస్.ఎస్. రాజు, రొంగలి పోతన్న, బద్రి కూర్మారావ్, బసు పోతన, షణ్ముఖరావు, భాషా, ఈశ్వర్, బంగారం, లైబ్రేరియన్ శ్రీనివాస్, గురు ప్రసాద్ తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రారంభం సందర్భంగా శనివారం విజయనగరంలో గురజాడ అప్పారావుకి అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు స్మారక గృహంలో పూలమాలవేసి నివాళులర్పించారు.

## లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా చట్టం

**మహారాష్ట్ర సర్కార్ నిర్ణయం**

ముంబై: మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వం వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. 'లవ్ జిహాద్' కేసులకు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని భావిస్తోంది. ఇందుకోసం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సంజయ్ వర్మ నేతృత్వంలోని ప్యానెల్‌లో మహిళా శిశు సంక్షేమం, మైనారిటీ వ్యవహారాలు, న్యాయవ్యవస్థ, సామాజిక న్యాయం, హోం వంటి కీలక శాఖలకు చెందిన సీనియర్ అధికారులు ఉన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితుల్ని, ఇప్పటికే ఉన్న చట్టాలను అధ్యయనం చేసి 'లవ్ జిహాద్', మోసం, బలవంతపు మతమార్పిడిపై చర్యలను సూచించే ఓ ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తుంది. ఈ కమిటీ 'లవ్ జిహాద్' సంఘటనలకు సంబంధించిన చట్టపరమైన, సాంకేతిక అంశాలను పరిశీలించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తుంది. ఆ తరువాత తదుపరి చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. ఇప్పటికే దేశంలోని కొన్ని రాష్ట్రాలు 'లవ్ జిహాద్'కు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.